జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



రంగారెడ్డి | శనివారం 5 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 210 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com





- రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలవడంతో నిధుల సమీకరణ ఇప్పటికే కొలిక్కి
- ఏప్రిల్ మూడో వారం లోపు రాజధాని నిర్మాణ పనుల్ని ప్రధానమంత్రి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఎపి సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 217 చ.కి.మీల విస్తీర్ణంతో అమరావతి ప్రజా రాజధానిని నిర్మించేందుకు ఈ ప్రభుత్వం తిరిగి శరవేగంగా అడుగులు
- ఈనెలలోనే ప్రధానమంత్రి సుమారు లక్ష కోట్ల రూ.ల పనుల పున:ప్రారంభం, పనులు శంఖుస్థాపనలు,ప్రారంభోత్సవాలకు శ్రీకారం



## 217 చ.కి.మీల విస్తీర్ణంలో

# అమరావతి నిర్మాణం?



**అమరావతి**

ఏపీ రాజధాని అమరావతి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలవడంతో నిధుల సమీకరణ ఇప్పటికే కొలిక్కి వచ్చింది. ఏప్రిల్ మూడో వారం లోపు రాజధాని నిర్మాణ పనుల్ని ప్రధానమంత్రి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎపి సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 217 చ.కి.మీల విస్తీర్ణంతో అమరావతి ప్రజా రాజధానిని నిర్మించేందుకు ఈప్రభుత్వం తిరిగి శరవేగంగా అడుగులు వేస్తోందని - మిగతా3లో

# 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

- గంటల కొద్ది వేచి చూసే విధానానికి స్వస్తి
- అవినీతి తగ్గిపోతుంది.. పారదర్శకత పెరుగుతుంది
- స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ సేవలను శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ హరి నారాయణ, అడిషనల్ - మిగతా3లో



## డీఎంకే సర్కార్‌కు ఎదురుదెబ్బ

- నీట్ పరీక్ష నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు చేసిన అభ్యర్థనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరణ
- నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ఎప్పటి నుంచో పోరాటం చేస్తోంది.
- దక్షిణ రాష్ట్రం మరోసారి అవమానానికి గురైంది
- "కేంద్రం తమిళనాడు అభ్యర్థనను తిరస్కరించవచ్చు
- కానీ, మన పోరాటం మాత్రం ఆగదు
- న్యాయ నిపుణులపై చర్చించి ఈ నిర్ణయాన్ని సవాల్ చేసే అంశం పరిశీలిస్తాం

## విద్య-వైద్య రంగాలు

# తమ ప్రాధామ్యాలు

- ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి
- కొత్తగా 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లు
- పీపీపీ పద్దతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన
- రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తత పరచాలి
- అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు
- ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలి
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు స్థాపించేలా కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన - మిగతా3లో

## తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి రేసులో

# ఆ నలుగురు

- ప్రస్తుతం ఆ పార్టీ అధ్యక్షుడుగా ఉన్న కె.అన్నామలై కీలక వ్యాఖ్యలు చేయడంతో ఆయన స్థానంలో ఎవరికి పార్టీ అధ్యక్షుడి పగ్గాలు అప్పగించనున్నారనే ఊహాగానాలు
- ఈనెల 8-10 తేదీల మధ్య కొత్త నేతను పార్టీ అధిష్టానం ఎన్నుకునే అవకాశం



# ఏపీలో నామినేటెడ్ పదవుల పండగ

- 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది.
- ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు
- ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం
- పలువురు సీనియర్ నేతలకు ఇప్పటికే విడతల వారిగా కీలక పోస్టులు



**అమరావతి**

ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. అందులోభాగంగా 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు కేటాయించింది ప్రభుత్వం. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకోసం కసరత్తు జరుగుతోందని పేర్కొంది. 2024 మే, జూన్ మాసాల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు కూటమికి పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటులో భాగంగా పలువురు సీనియర్లు ఎన్నిక వేళ.. సీట్లు వదులుకోవాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం - మిగతా3లో

# తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి రేసులో ఆ నలుగురు



**చెన్నై:** తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి రేసులో తాను లేనంటూ ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న కె.అన్నామలై కీలక వ్యాఖ్యలు చేయడంతో ఆయన స్థానంలో ఎవరికి పార్టీ అధ్యక్షుడి పగ్గాలు అప్పగించనున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈనెల 8-10 తేదీల మధ్య కొత్త నేతను పార్టీ అధిష్టానం ఎన్నుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. సామాజిక వర్గం, పార్టీ పట్ల విధేయత వంటివి సహజంగానే పరిగణనలోకి తీసుకుంటారు. ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో నాలుగు పేర్లు ప్రమఖంగా వినిపిస్తున్నాయి. వీరిలో తమిళిసై సౌందరరాజన్, నైనార్ నాగేంద్రన్, ఎల్.మురుగన్, వనతి శ్రీనివాసన్ ఉన్నారు.

**1.తమిళిసై సౌందరరాజన్**

తమిళనాడు బీజేపీ సీనియర్ నేతగా, పార్టీ విధేయురాలిగా తమిళిసై సౌందర్‌రాజన్‌కు పేరుంది. గతంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా, ఇటీవల వరకూ తమిళనాడు గవర్నర్‌గా ఆమె పనిచేశారు. 2024లో తిరిగి ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. సౌత్ చెన్నై లోక్‌సభ సీటు నుంచి పోటీ చేసి డీఎంకే అభ్యర్థి తమిళాచి తంగపాండియన్ చేతిలో ఓడిపోయారు. రాజకీయాల్లో అనుభవం ఉన్నప్పటికీ గతంలో ఆమె రాష్ట్ర బీజేపీ అధక్షురాలిగా ఉన్నప్పుడు పార్టీకి పెద్దగా లాభించినది లేదనే చెప్పాలి. అయితే విధేయత, అందరికి తెలిసిన వ్యక్తినే పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎంపిక చేయదలచుకుంటే ఆమె ఈ పదవికి గట్టి పోటీదారుగానే చెప్పాలి.

**2.నైనార్ నాగేంద్రన్**

సీజన్డ్ పొలిటీషన్‌గా ఈయనకు పేరుంది. అటు అన్నాడీఎంకేతోనూ, ఇటు బీజేపీతోనూ ఆయనకు సాన్నిహిత్యం ఉంది. అడ్మినిస్ట్రేషన్ అనుభవం ఉంది. అన్నాడీఎంకే ప్రభుత్వంలో (2001-2006) మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2017లో ఆయన బీజేపీలో చేరారు. విద్యుత్, పరిశ్రమలు, రవాణా వంటి కీలక పదవుల్లో పనిచేశారు. తిరునల్వేలి నుంచి పలుమార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. గెలిచిన సందర్భాలతో పాటు ఓడిన సందర్భాలు కూడా ఉన్నాయి. మార్వార్ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు దక్షిణ తమిళనాడుతోనూ, మర్వార్ వర్గీయుల్లోనూ పలుకుబడి ఉంది. ఈ క్రమంలో ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకునే అవకాశం ఉండొచ్చు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోవడం ఆయనకు ప్రతికూలం కావచ్చు.

**3.ఎల్.మురుగన్**

రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడుగా ఉన్న ఎల్.మురుగన్ ప్రస్తుతం కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు అప్పగిస్తే దళిత ఓటర్లను పార్టీ వైపు ఆకర్షించే అవకాశం మెండుగా ఉంటుంది. న్యాయవాది కావడం, ఆర్ఎస్ఎస్‌తో ఉన్న అనుబంధం ఆయనకు కలిసొచ్చే అంశాలు. బీజేపీ చీఫ్‌గా ఆయన 2020 నుంచి 2021 వరకూ పనిచేశారు. పార్టీని విస్తరించే ప్రయత్నాలు గట్టిగానే చేశారు. అయినప్పటికీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ధరపురం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో నీలగిరి నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూశారు. అయితే హిందుత్వవాదిగా, దళిత ప్రతినిధిగా చూసినప్పుడు ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు అప్పగించే అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి.

**4.వనతి శ్రీనివాసన్**

ప్రస్తుతం కోయంబత్తూరు సౌత్ ఎమ్మెల్యేగా వనతి శ్రీనివాసన్ ఉన్నారు. తమిళనాడు బీజేపీ మహిళా నేతల్లో ప్రముఖులుగా ఆమెకు పేరుంది. పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా పార్టీకి సేవలందించారు. 2021లో ప్రముఖ నటుడు కమల్‌హాసన్‌పై గెలవడం ఆమెకు రాజకీయంగానూ మంచి గుర్తింపు తెచ్చింది. ఓబీసీ కావడం, సంస్థాగత అనుభవం కలిసొచ్చే అంశాలు.

# ఈ రూల్స్ తెలుసా.. వీరు టోల్ ఫీజు కట్టనక్కర్లేదు




భారతదేశంలో ప్రతి రాష్ట్రంలోనూ అనేక టోల్ ప్లాజాలు ఉన్నాయి. ప్రస్తుత లెక్కల ప్రచారం దేశ వ్యాప్తంగా సుమారు 1063 టోల్ ప్లాజాలు ఉన్నాయి. వీటి సంఖ్య కూడా నానాటికి పెరుగుతోంది. గత 5 సంవత్సరాల్లో 400 లకు పైగా కొత్త టోల్ ప్లాజాలు ఏర్పాటయ్యాయి. త్రీ వీలర్ నుంచి భారీ వాహనాల వరకు రోడ్డుపై నడపాలంటే టోల్‌గేట్ వద్ద ట్యాక్స్ కట్టాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరూ టోల్ చెల్లిస్తేనే టోల్ గేట్ దాటేందుకు అనుమతిస్తారు. అయితే, గతంలో మాన్యువల్‌గా టోల్ ఛార్జీలు చెల్లించేవారు. కానీ, ఇప్పుడు అంతా ఆన్‌లైన్ సిస్టమ్ అయ్యింది. ఫాస్టాగ్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఫాస్టాగ్ సహాయంతో క్షణాల్లో చెల్లింపులు జరిగిపోతున్నాయి. అయితే, ఫాస్టాగ్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం.. కొన్ని నిబంధనలు కూడా పెట్టింది. అందులో 10 సెకన్ల నియమం చాలా కీలకమైంది. ఈ నియమం ద్వారా ఎలాంటి టోల్ ఫీజు చెల్లించకుండానే టోల్ గేట్ దాటే అవకాశం ఉంటుంది. మరి ఈ నియమం గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. ప్రతిరోజూ లక్షలాది వాహనాలు టోల్ ప్లాజాల గుండా వెళుతుంటాయి. వీటి కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అనేక నియమనిబంధనలు రూపొందించి. ఈ నియమాల్లో ఒకటి 10 సెకన్ల రూల్. దీని ప్రకారం.. టోల్ ప్లాజా వద్ద ఒక వాహనం నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు నిలిచి ఉన్నట్లయితే.. అలాంటి వాహనానికి టోల్ ఛార్జ్ వర్తించదు. వారు టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు. రద్దీ సమయాల్లోనూ ఈ నియమం వర్తిస్తుందని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఈ రూల్‌ని ఎన్‌హెచ్‌ఏఐ 2021లో తీసుకువచ్చింది.

**వీరు కూడా టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు..**

టోల్ ట్యాక్స్ పేమెంట్ విషయంలో మరో రూల్ కూడా ఉంది. అది కూడా సామాన్యులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం.. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల దూరంలోని వాహనాలకు ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. స్థానిక ప్రజలు తమ వాహనాలపై నిరంతరం వెళ్లాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనను రూపొందించారు. అయితే, కమర్షియల్ వాహనాలకు మాత్రం ఈ అవకాశం లేదు. స్థానికులై ఉండి.. టోల్ ట్యాక్స్ మినహాయింపు కావాలంటే.. లోకల్ రెసిడెంట్ పాస్ గానీ, నెలవారీ పాస్ గానీ తీసుకోవాలి. అలాగే లోకల్ ప్రూఫ్ ఉండాలి. లేదంటే రెట్టింపు ఫైన్ కట్టాల్సి వస్తుంది.

# వక్ఫ్ బిల్లు ఆమోదంపై భారీ ఎత్తున నిరసనలు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ లో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం ముద్ర పడిన కొన్ని గంటల వ్యవధిలోనే పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. పార్లమెంట్ లో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్, తమిళనాడులో నిరసన గళం వినిపిస్తూ నిరసనకు దిగాయి ముస్లిం సంఘాలు. .'వక్ఫ్ సవరణ బిల్లును మేము వ్యతిరేకిస్తున్నాం' అంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్ కతా, తమినాడులోని చెన్నై, గుజరాత్ లోని అహ్మదాబాద్ లో భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళలన్నీ జాయింట్ ఫారమ్ ఆఫ్ వక్ఫ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలోని జరిగినట్లు జాతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ తెలిపింది.

**అహ్మదాబాద్‌లో తీవ్రరూపం**

వక్ఫ్ బిల్లుపై నిరసన కార్యక్రమం అహ్మదాబాద్ లో తీవ్రరూపం దాల్చింది. రోడ్లపై కూర్చొని పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అయితే పోలీసులు వారిని బలవంతంగా తొలగించే ప్రయత్నం చేసే క్రమంలో అక్కడ మరింత ఉద్రిక్తత నెలకొంది.

**తమినాడు వ్యాప్తంగా విజయ్ తమిళగ వెట్రి కజగం నిరసన**

చెన్నైలో కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించాయి, అక్కడ ఇటీవలే పార్టీ స్థాపించిన నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కజగం' రాష్ట్రవ్యాప్త నిరసనను ప్రకటించింది. చెన్నై కోయంబత్తూర్, తిరుచిరాపల్లి వంటి ప్రధాన నగరాల్లో టీవీకే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. చేతిలో ప్లకార్డులతో తమ నిరసన తెలిపారు. ముస్లింల హక్కులను హరించవద్దు అంటూ నిరసన వ్యక్తమైంది. కాగా, రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు%-%2025పై పార్లమెంటు ఆమోద ముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది. దాదాపుగా ప్రతి సవరణపైనా ఓటింగ్‌కు విపక్షాలు పట్టుబట్టాయి. వాటి సవరణలన్నీ వీగిపోయాయి. చివరికి బిల్లు ఆమోదం పొందింది. దానికి అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. వక్ఫ్ బిల్లును కేంద్రం ఇక రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అది చట్టంగా రూపుదాల్చుతుంది. వక్ఫ్ బిల్లును లోక్‌సభ 288%-%232 ఓట్లతో ఆమోదించడం తెలిసిందే

## బాలీవుడ్ హీరో మనోజ్ కుమార్ మృతి

**ముంబై :** బాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. సీనియర్ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ ఈ ఉదయం కన్నుమూశారు. 87 ఏళ్ల మనోజ్ కుమార్ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ మరణంపై బాలీవుడ్ తీవ్ర విచారం వ్యక్తంచేస్తోంది. ప్రముఖ నటుడి మరణం అభిమానులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.మనోజ్ కుమార్ చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. మనోజ్ కుమార్ తన దేశభక్తి చిత్రాలకు ప్రసిద్ధి చెందారు. ఆయన బాలీవుడ్‌లో 'భరత్ కుమార్'గా పిలుస్తారు.మనోజ్ కుమార్ మరణంపై చిత్రనిర్మాత అశోక్ పండిట్ మాట్లాడుతూ, "... దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, మా ప్రేరణ, భారత చలనచిత్ర పరిశ్రమకు 'సింహం' మనోజ్ కుమార్ మనతో లేరు. ఇది పరిశ్రమకు భారీ నష్టం " అని అన్నారు. జూలై 24, 1937న హరికృష్ణ గిరి గోస్వామిగా జన్మించిన మనోజ్ కుమార్ హిందీ చిత్రసీమలోకి ప్రవేశించి చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. అతను "షహీద్" (1965), "ఉప్కార్" (1967), "పురబ్ ఔర్ పశ్చిమ్" (1970), "రోటీ కప్డా ఔర్ మకాన్" (1974) వంటి దేశభక్తి ఇతివృత్తాలతో కూడిన చిత్రాల్లో నటించడమే కాకుండా దర్శకత్వం కూడా చేశారు. ఈ సినిమాల కారణంగా ఆయనను 'భరత్ కుమార్' అని కూడా పిలిచేవారు.దేశభక్తి చిత్రాలే కాకుండా, "హరియాలీ ఔర్ రాస్తా", "వో కౌన్ థీ", "హిమాలయ్ కి గాడ్ మే", "దో బదన్", "పత్తర్ కే సనమ్", "నీల్ కమల్" "క్రాంతి" వంటి ఇతర ముఖ్యమైన చిత్రాల్లో నటించాడు, దర్శకత్వం వహించాడు. 1995లో 'మైదాన్-ఎ-జంగ్' చిత్రం ఆయన నటించిన చివరి సినిమా. అవార్డులు, గౌరవాలు మనోజ్ కుమార్ భారతీయ సినిమాకు చేసిన కృషికి గాను 1992లో పద్మశ్రీ, 2015లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు.

## డీఎంకే సర్కార్‌కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ/చెన్నై :** వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష విషయంలో డీఎంకే ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. నీట్ పరీక్ష నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు చేసిన అభ్యర్థనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆ రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. తమ ప్రభుత్వం అన్ని వివరణలు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నీట్‌ను ఉప సంహరించుకోలేదన్న ఆయన.. ఈ వ్యవహారంలో తమిళనాడు చేస్తున్న పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు ఈ నెల 9వ తేదీన పార్టీలకతీతంగా ఎమ్మెల్యేందరితోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ఎప్పటి నుంచో పోరాటం చేస్తోంది. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ, పరీక్షను క్లియర్ చేయలేని స్థితిలో పలువురు అభ్యర్థులు బలవన్మరణానికి పాల్పడడంతో ఇదొక తీవ్ర అంశంగా మారిందక్కడ. కోచింగ్‌లకు వెళ్లే స్తోమత లేని విద్యార్థుల పాలిట ఇదొక శాపంగా మారిందనే అభిప్రాయం అక్కడ వ్యక్తమైంది. సామాజిక న్యాయం దక్కాలంటే నీట్ వద్దనే నినాదంతో పోరాడుతూ వస్తోంది. అందుకే నీట్ బదులు 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి తమిళనాడును అనుమతించాలని తమిళనాడు ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది. అయితే.. 2021-22 నుంచే అది పెండింగ్‌లో ఉంటూ వస్తోంది. ఈ క్రమంలో.. కిందటి ఏడాది జూన్‌లో తమిళనాడు ప్రభుత్వం ఏకగ్రీవంగా నీట్‌ను రద్దు చేయాలంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది కూడా. అయినప్పటికి కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు. తాజా ఎదురు దెబ్బపై స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. దక్షిణ రాష్ట్రం మరోసారి అవమానానికి గురైందని అన్నారు. "కేంద్రం తమిళనాడు అభ్యర్థనను తిరస్కరించవచ్చు. కానీ, మన పోరాటం మాత్రం ఆగదు. న్యాయ నిపుణులపై చర్చించి ఈ నిర్ణయాన్ని సవాల్ చేసే అంశం పరిశీలిస్తాం అని స్టాలిన్ ప్రకటించారు. మరోవైపు తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్ కూడా నీట్‌కు వ్యతిరేకంగా ఓ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఇంకోవైపు.. కాంగ్రెస్, ఆర్జేడీ లాంటి పార్టీలు కూడా నీట్‌ను మొదటి నుంచే వ్యతిరేకిస్తూ వస్తున్నాయి.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ పార్టీ



**న్యూఢిల్లీ:** బీజేపీ సర్కారు తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ఆ బిల్లు పాసైన విషయం తెలిసిందే. ఆ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అయితే ఆ బిల్లుకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లనున్నట్లు ఇవాళ కాంగ్రెస్ పార్టీ నేత జయరాం రమేశ్ తెలిపారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో ట్వీట్ చేశారు. 2019లో ప్రభుత్వం తెచ్చిన సీఏఏను సుప్రీంలో సవాల్ చేశామని, 2005 ఆర్టీఐ చట్టం సవరణను ప్రశ్నిస్తూ సుప్రీంలో సవాల్ చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ అంశంపై తెచ్చిన సవరణలను ప్రశ్నిస్తూ కూడా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పార్టీ కేసు ఫైట్ చేస్తోందన్నారు. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం అమలను నిలదీస్తూ కూడా సుప్రీంలో కేసు వేశామన్నారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టులో పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన అసదుద్దీన్ ఒవైసీ

**ఢిల్లీ:** వక్ఫ్ బిల్లుపై అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీం కోర్టులో ఆయన సవాల్ చేశారు. వక్ఫ్ బిల్లు చట్ట విరుద్ధమని.. వక్ఫ్ ఆస్తులు లాక్కునే కుట్ర జరుగుతోందంటూ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఈ వివాదాస్పద బిల్లు ఆమోదం పొందడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. కాగా, రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు%-%2025పై పార్లమెంటు ఆమోదముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది.

# సెకీ విద్యుత్ ఒప్పందంపై అమెరికాలో నమోదైన కేసుపై ప్రభుత్వం స్పందించాలి

**యూజర్స్ చార్జీలు రద్దు చేయాలి**
**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**

**కర్నూలు :** రాష్ట్ర ప్రభుత్వం సెకీ ఒప్పందం కోసం ఆదానితో రూ. 1750 కోట్ల లంచం తీసుకున్నట్లు అమెరికాలో నమోదైన కేసుపై ప్రభుత్వం స్పందించాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. అదానికి అమెరికా కోర్టు నోటీసులు కూడా ఇచ్చిందన్నారు. ఏపీలో ఇన్ని వసతులు ఉంటే రాజస్తాన్ నుండి విద్యుత్ తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సెకీ విద్యుత్ ఒప్పందం, ప్రజలకు భారమైన యూజర్స్ చార్జీలు వెంటనే రద్దుచేయాలని శుక్రవారం కర్నూలు నగర శివారుల్లో ఉన్న ఏపీఈఆర్సీ కార్యాలయంలో యాక్సస్ఎనర్జీ 400 మెగావాట్ల విద్యుత్ ఎస్సీడీపీఎల్ కొనుగోలు ఒప్పందంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన చైర్మెన్ దష్టికి తీసుకు వచ్చారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదానితో రాజస్తాన్ నుండి ఇక్కడకు విద్యుత్ సరఫరా చేయుటకు ఒప్పందం కుదుర్చుకోవడం దారుణమన్నారు. ఈ ఒప్పందం వలన రాష్ట్రప్రజలపై 25 సంవత్సరాల్లో రూ.1.20 లక్షల కోట్ల భారం పడుతుందన్నారు. విద్యుత్ యూనిట్ 25 సంవత్సరాల తరువాత రూ. 6.25 పైసలు పడుతుందన్నారు. ఏపీలో సోలార్ విద్యుత్ అవకాశం ఉంటే ఆనాడు ప్రభుత్వం ఆదానితో ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 2021లో గుజరాత్ రాష్ట్రం యూనిట్ రూ. 1.99 పై ఇస్తుంటే రాజస్తాన్తో యూనిట్ రూ.2.49 పై ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందో చెప్పాలన్నారు.




ఇది అతిపెద్దస్కాం అని వెంటనే దీనిని రద్దుచేయాలన్నారు. ఎన్నికల ముందు దీనిపై ఏపీ హైకోర్టులో ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్ కోర్టులో కేసు వేశారని అధికారంవచ్చిన తరువాత పట్టించు కోకపోవడం దారుణమన్నారు. సీపీఐ తరుపున మేము కేసు వేశామన్నారు. ఏపీఈఆర్సీ పరువు కాపాడాలని, వెంటనే సెకి ఒప్పందం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఇష్టాను సారంగా వేసిన యూజర్చార్జీలు తమ ప్రభుత్వం వస్తే విద్యుత్చార్జీలు పెంచమని,యూజర్స్ చార్జీలు తగ్గిస్తామన్న చంద్రబాబునాయుడు సెకి ఒప్పందం వెంటనే రద్దుచేయాలని, యూజర్స్చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏపీఈఆర్సీ చైర్మెన్ పీవీఆర్ రెడ్డికి సమస్యలు వివరించి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, నగర కార్యదరి రామకృష్ణారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి భారతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు వెంకటేష్, అటోవర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వర్, క్రిష్ణారెడ్డి, నల్లన్న రాముడు, కుమార్,, మల్లిఖార్జున, రామాంజినేయులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సజ్జలకు ఏమైంది...

**నెల్లూరు :** వైసీపీ కీలక నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కొన్నాళ్లుగా తెరపైకి రావడంలేదు. నిన్న జరిగిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల మీటింగ్ లో కూడా సజ్జల లేరు. వైసీపీలో సహజంగా ఇలాంటి మీటింగ్ లను ఏర్పాటు చేసేది, నిర్వహించేది కూడా ఆయనే, కానీ తాడేపల్లిలో జరిగిన ఈ మీటింగ్ కి ఆయన హాజరు కాలేదు. కొన్నాళ్లుగా అస్సలు తాడేపల్లిలో జరిగే సమావేశాల్లో, బయట జగన్ పాల్గొనే కార్యక్రమాల్లో కూడా సజ్జల కనపడ్డం లేదు. అసలు సజ్జల ఎక్కడున్నారు, పార్టీ కార్యక్రమాలకు ఎందుకు హాజరు కావడంలేదు..వైసీపీ ఓడిపోయిన తర్వాత సజ్జలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆయన వల్లే పార్టీ ఓడిపోయిందని ఓ వర్గం విమర్శలు చేసింది. అయితే జగన్ ఈ మాటల్ని పట్టించుకోలేదు సరికదా సజ్జల ప్రయారిటీని ఆయన ఏమాత్రం తగ్గించలేదు. పార్టీ ఓడిపోయిన తర్వాత జరిగిన నిరసనలు, పార్టీ మీటింగ్ లలో కూడా సజ్జల కీలకంగా వ్యవహరించారు. దీంతో ఆయనను వేలెత్తి చూపించేవారు తర్వాతి కాలంలో సైలెంట్ అయ్యారు. ఇక సజ్జల తనయుడు భార్గవ్ రెడ్డికి పార్టీ సోషల్ మీడియా వింగ్ ని పూర్తిగా అప్పగించేయడం కూడా చాలామందికి ఇష్టం లేనట్టుగా ఉంది. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా చూపించి, జగన్ ని భ్రమల్లో పెట్టి వాస్తవాలు తెలియకుండా చేసి పార్టీకి నష్టం జరిగేలా చేశారంటూ సోషల్ మీడియా వింగ్ పై కూడా విమర్శలు వచ్చాయి. కానీ జగన్ పట్టించుకోలేదు. ఆ తర్వాత పోసాని అరెస్ట్, విచారణలో ఆయన చెప్పిన విషయాలు కొన్ని సజ్జలకు వ్యతిరేకంగా ఉన్నాయి. పార్టీ వీడిన సీనియర్ నాయకుడు విజయసాయిరెడ్డి కూడా జగన్ చుట్టూ కోటరీ ఉందని చేసిన ఆరోపణలు కూడా వైరల్ గా మారాయి. ఆ తర్వాతే సజ్జల పార్టీ వ్యవహారాలకు కాస్త దూరం జరిగినట్టు తెలుస్తోంది. పార్టీ తరపున వాయిస్ వినిపించే ఆయన కొన్నాళ్లుగా మీడియా ముందుకు రావడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో కూడా కనపడ్డం లేదు. నిజంగానే జగన్ ఆయన్ను దూరం పెట్టారా లేదా అనేది తేలాల్సి ఉంది.ఒకవేళ తనకు తానే సజ్జల, జగన్ కి దూరంగా ఉన్నారా అనేది కూడా



తేలాల్సి ఉంది. సహజంగా ఒక పార్టీలో ఇలాంటి ఆరోపణలు వస్తే.. కొన్నాళ్లు సదరు వ్యక్తి పార్టీకి దూరంగా ఉన్నట్టు సీన్ క్రియేట్ చేస్తారు. ప్రస్తుతం వైసీపీలో కూడా అదే జరుగుతోందా అనేది తేలాల్సి ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడ జగన్ ని అంటిపెట్టుకుని ఉన్న సజ్జల, 2024 ఓటమి తర్వాత కూడా కొన్నాళ్లు పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నారు. సడన్ గా ఇప్పుడు సైలెంట్ అవ్వడం వెనక ఏదో జరుగుతోందనే అనుమానం ఉంది. పరిస్థితులన్నీ చక్కబడిన తర్వాత ఆయన ఎంట్రీ ఇస్తారేమో తెలియాలి.కీలకమైన నేత కొన్నిరోజులుగా కనపడ్డం లేదు. సోషల్ మీడియాలో ఆయనపై వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై పార్టీ నేతలెవరూ స్పందించకపోవడం విశేషం. ఉద్దేశపూర్వకంగానే వారు స్పందించడంలేదా, లేక వారికి కూడా సరైన సమాచారం లేదా అనేది తేలాల్సి ఉంది. గతంలో పార్టీ చేపట్టే కార్యకలాపాలు, నిరసనలు, ప్రెస్ మీట్లలో మాట్లాడాల్సిన అంశాలు.. ఇలాంటివన్నీ సజ్జల నుంచే బయటకు వచ్చేవి. కానీ ఇప్పుడాయన లేకపోయినా నేతలు మీడియా ముందుకొస్తున్నారు. మరి ఈ ఆదేశాలు ఇచ్చేది ఎవరు, ఎవరి డైరక్షన్లో ఇవన్నీ జరుగుతున్నాయి. నేరుగా జగన్ నేతలతో మాట్లాడే అవకాశం లేదు. కార్యక్రమాల గురించి కబురందించడానికి, వాటిని సమన్వయ పరచడానికి కీలక నేత ఒకరు ఉండాలి. సజ్జల లేనప్పుడు ఆ పని ఎవరు చేస్తున్నారు..? ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి..? మరికొన్నిరోజులాగితే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## విద్య-వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలు

-మొదటిపేజీ తరువాయి

చేయాలని, ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు. విద్య%-%వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలుగా చెప్పిన ముఖ్యమంత్రి...గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. పీహెచ్సీ, సీహెచ్సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాలన్నారు. అన్యారోగ్యం బారిన పడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి... ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి చాలావరకు బయటపడవచ్చున్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా మరో 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్సీల్లో వైద్య ఖాళీల భర్తీ, విజయనగరంలో కొత్తగా 8 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయాలసిస్ మెషిన్లు పెంచడం, కొవ్వూరు%-%నిడదవోలు సీహెచ్సీలను అప్గ్రేడ్ చేయడం తదితర అంశాలపైన మార్గదర్శకాలు జారీ చేశారు.

## 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి




-మొదటిపేజీ తరువాయి

ఐజీ ఉదయ భాస్కర్, జాయింట్ ఐజీలు రవికుమార్, సరోజలతో కలిసి స్లాట్ బుకింగ్ అవగాహన కరప్రతాన్ని, పోస్టర్ ను మంత్రి సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సులభతరంగా సేవలు అందించాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్ అధికారిక వెబ్ సైట్ లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి కొచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాకుక్ష్యులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తమకు కుదిరిన సమయాల్లో వచ్చి పని పూర్తి చేసుకోవచ్చన్నారు. స్లాట్ ఆధారిత అపాయింట్మెంట్లు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తాయన్నారు. ఈరోజున మొత్తం 26 జిల్లా ప్రధాన కార్యాలయాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, మొత్తం 296 సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ బుకింగ్ సిస్టమ్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే గాంధీనగర్, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా అన్లైన్ లో డేటా ఎంట్రీ చేసి డాక్యుమెంట్ ప్రీపేర్ చేసుకొని ఫీజు కూడా కట్టేసి ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చిన 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయిపోతుందన్నారు. ఒక వేళ స్లాట్ బుకింగ్ చేసుకోలేకపోయిన వారు సబ్ రిజిస్టార్ ఆఫీసుకు వస్తే సాయంత్రం ఐదు గంటల తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా రూ. ఐదు వేల రూపాయల ప్రత్యేక ఫీజు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోదియా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల శాఖలో వరుసగా తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా అవినీతి తగ్గిపోయి పారదర్శకత పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఫేస్ లెస్, పేపర్ లెస్, క్యాష్ లెస్ గా రిజిస్ట్రేషన్లు జరపాలనేది తమ లక్ష్యమని చెప్పారు.

## ఏపీలో నామినేటెడ్ పదవుల పండగ

-మొదటిపేజీ తరువాయి

నామినేటెడ్ పోస్టులు కట్టబెడతామంటూ వారికి హామీ సైతం ఇచ్చారు. ఇక సదరు ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు మొత్తం 175కి 164 స్థానాలకు గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా పలువురు సీనియర్ నేతలకు ఇప్పటికే విడతల వారిగా కీలక పోస్టులు కేటాయించింది. ఈ కేటాయింపుల్లో సైతం మిత్ర ధర్మం పాటిస్తూ చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఆ క్రమంలో ఏఎంసీ చైర్మన్ల పేర్లను ప్రకటించారు. మిగతా వారి పేర్లను సైతం మరికొద్ది రోజుల్లో ప్రకటించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# 217 చ.కి.మీల విస్తీర్ణంలో అమరావతి నిర్మాణం?

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. దానిలో భాగంగానే అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు,పలు ట్రంక్ రోడ్ల నిర్మాణం,ఇతర నిర్మాణాలు,సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులకు పెద్దఎత్తున నిధులు సమీకరించి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినట్టు వివరించారు. ఈనెలలోనే ప్రధానమంత్రి సుమారు లక్ష కోట్ల రూ.ల పనుల పున:ప్రారంభం, పనులు శంఖుస్థాపనలు,ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారని వివరించారు.ఇంకా పలు అంశాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలను సింగపూర్ ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు.ప్రధాని పర్యటనపై సిఎస్ విజయానంద్ సమీక్షించారు. రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభించడంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు శంఖుస్థాపన,ప్రారంభోత్సవాలకు ఈనెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అమరావతికి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. అమరావతిలో ప్రధాని పర్యటన ఖరారు కావాల్సి ఉంది. ఈలోగా సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటి నుండే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని సిఎస్ అధికారులను ఆదేశించారు.ఇటీవల పి-4 కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని పర్యటన కార్యక్రమం ఉండే విధంగా ఆప్రాంతాన్ని 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చదును చేయడంతో పాటు తగిన పార్కింగ్ తదితర



ఏర్పాట్లు చేయాల్సి ఉందని ఆదిశగా ఇప్పటి నుండే తగిన కసరత్తు మొదలు పెట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సిఎస్ సూచించారు.డీజీపీ, సిఆర్డిఏ అధికారులు, గుంటూరు జిల్లా కలక్టర్, ఎస్పీ,వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వీర పాండియన్ తదితర అధికారులు వెంటనే ఆప్రాంతాన్ని సందర్శించి ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు.గతంలో రాష్ట్రంలో ప్రధానమంత్రి పర్యటనలో చురుగ్గా పనిచేసిన అధికారుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించేందుకు ఆయా అధికారుల జాబితాను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు.ప్రస్తుత వేసవి దృష్ట్యా కార్యక్రమానికి వచ్చే వివిఐపి, విఐపిలు,ప్రజలు తదితరులు అందరికీ తగిన పూర్తి వసతులు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాల్సి ఉందని చెప్పారు.ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తి స్థాయిలో మరొక సారి శాఖల వారీ ఏర్పాట్లపై సమీక్షిస్తామని, ఈలోగా తగిన ప్రాథమిక కసరత్తు ప్రారంభించాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరి గానే సింగపూర్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజ్ఞప్తి చేశారు.2014-2019లో అమరావతి ప్రజా రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం ఒక కీలక భాగస్వామిగా ఉందని అదే స్థితిని ప్రస్తుతం కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈప్రభుత్వం తిరిగి అధికారానికి వచ్చిన రోజు నుండే అమరావతి రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఇప్పటికే అమరావతి రాజధానికి సంబంధించి కేంద్ర నిధులతో పాటు ప్రపంచ బ్యాంకు,హడ్ కో,ఎడిబి వంటి సంస్థలతో పెద్దఎత్తున నిధులు టైఅప్ చేసిందని నిధులకు ఎలాంటి సమస్య లేదని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అమరావతి రాజధాని నిర్మణ పనులను పున:ప్రారంభించేందుకు రానున్నారని సిఎస్ తెలిపారు.కావున గతంలో మాదిరే సింగపూర్ ప్రభుత్వం పూర్తిగా సహకరించేందుకు కృషి చేయాలని అన్నారు.గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులతో సమావేశం ఉన్నందున అన్ని అంశాలపై మరింత స్పష్టత వస్తుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు.అమరావతి మాస్టర్ ప్రణాళికను గతంలోనే సిద్ధం చేయడం జరిగిందని గుర్తు చేశారు. అమరావతి రాజధానిని ప్రపంచంలోనే ఒక ఉత్తమ సస్టైయినబుల్ అండ్ అత్యంత లివబుల్ సిటీగా నిర్మించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిపారు.

## సంపాదకీయం

# బెట్టింగ్ యాప్‌లను నిషేధించలేరా?

ఆన్‌లైన్ బెట్టింగులలో కాసినో యాప్‌ల నుండి పోకర్, రౌలెట్, బ్లాక్ జాక్, జంగ్లీ, రమ్మీ వంటి వాటితో పాటు లాటరీ యాప్‌లు.. ఇలా చెప్పుకుంటూపోతే కోకొల్లలు. ఇవన్నీ ఎక్కడో విదేశాల నుండి నడిపిస్తున్నా మన రాష్ట్రాల్లో మరింత ప్రభావం చూపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ మెట్రో రైల్లో ఓ బెట్టింగ్ యాప్‌ను అడ్వర్టైజ్ చేసినప్పుడు పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో తొలగించాల్సి వచ్చింది. ఈ బెట్టింగ్ యాప్‌లను సినీ, క్రీడా స్టార్లు ప్రమోట్ చేయడంతో ఈ మోజులో సామాన్యులూ పడుతున్నారు. వీటికి తోడు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల చెలామణీ విపరీతంగా పెరిగింది. పెద్ద పెద్ద సెలబ్రెటీలు, సినిమా స్టార్లు, రాజకీయ నాయకుల పిల్లలు దొరికిపోవడం చూస్తున్నాం.ఇక సంక్రాంతి వచ్చిందంటే చాలు. కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతాయి. కోర్టులు వీటిని నిషేధించినా రాజకీయ నాయకులే దగ్గరుండి మరీ కోడిపందేలు ఆడించడం చూస్తున్నాం. యువతతో పాటు స్కూల్ పిల్లలు సైతం వారి తల్లిదండ్రుల ఫోన్లలో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఫోన్ నుండే యుపిఐ ల ద్వారా లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న ఘటనలు మన కళ్ల ముందే కనబడుతున్నాయి. నిర్దిష్టంగా లెక్కలు లేకపోయినా వీటి పర్యవసానంగా ఆత్మహత్యలు చేసుకున్నవారు, తమ ఆస్తులను అమ్ముకున్నవాళ్లు కూడా ఉన్నారు. ఆర్థికంగా అనేక కుటుంబాలు చితికిపోయాయి. వీటి కోసం హత్యలు కూడా జరిగినట్టు వార్తలు. ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలు, యూట్యూబర్లు కొంతమంది ఇవి నిషేధించినవని, వీటి తీవ్రత ఈ స్థాయిలో ఉంటుందని తెలియక ప్రమోట్ చేశామని తప్పించుకుంటున్నారు. ఇదే బెట్టింగ్ క్రీడలో వందల కోట్ల రూపాయలు కాజేసిన వారిపై ఇక్కడ కేసులు నమోదు కావడంతో దుబారు లాంటి దేశాలకు పారిపోయినా ప్రభుత్వాలు కళ్లప్పగించి చూస్తున్నాయి. ఈ బెట్టింగ్ యాప్‌లపై 'పబ్లిక్ గేంబ్లింగ్ యాక్ట్ 1867' వచ్చినా, అనంతర కాలంలో వీటిపై నిర్ణయాధికారం ఆ యా రాష్ట్రాలకు వదిలేయడంతో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మన రాష్ట్రంలో 1974లో ఎ.పి. గేంబ్లింగ్ యాక్ట్ వచ్చినా గోవా, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ఉండడంతో ఇక్కడ నియంత్రణ సాధ్యం కాలేదు. ఈ బెట్టింగ్ ఆటల ప్రభావం మరింత పెరగడంతో 2023లో 174 యాప్‌లను నిషేధించినా ఇంకా అనేక యాప్‌లకు అనుమతులు ఉండడం, మరికొన్నిటిని విదేశాల నుండి నిర్వహిస్తుండడంతో ఈ జూదం మోజు మన దేశంలో కూడా తీవ్రంగా ఉంది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై 28 శాతం జి.ఎస్.టి వసూలు చేస్తున్న మన ప్రభుత్వానికి ఏడాదికి 7 వేల కోట్లు ఆదాయం వస్తున్నది. వచ్చే ఏడాది 14 వేల కోట్లు జిఎస్‌టి వసూళ్ల టార్గెట్‌గా పెట్టుకున్నట్లు కేంద్ర రెవెన్యూ సెక్రటరీయే ప్రకటించారంటే దీని ఆదాయంపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ వున్నదో అర్ధమౌతోంది. ప్రజలు ఎలా పోయినా పరవాలేదు. మా ప్రభుత్వానికి ఆదాయం రావాలనే ధోరణి ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. అంటే సులభంగా ఆదాయం రావడమనేది ప్రజలకే కాదు, ప్రభుత్వాలకు కూడా అలవాటయ్యిందనే వాదనలకు బలం చేకూర్చినట్లయ్యింది. పన్నుల రూపంలో ఆదాయం వస్తుందనే పేరుతో దీనిపై నియంత్రణ చేయకపోవడం దుర్మార్గం. ఈ ఆన్‌లైన్ జూదానికి యువత బానిసలు అవుతుంటే.. విలాసాల కోసమో, సులువుగా డబ్బు సంపాదించేయాలనే యావతోనో మోసపోతుంటే... అది ప్రమాదమని తెలిసి, తప్పు అని గ్రహించినా ప్రభుత్వాలు ఎందుకని ఎటువంటి నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు? సాంఘికంగా ఇంతటి ప్రభావాన్ని చూపుతున్నవాటిని ఎందుకు నిషేధించలేకపోతున్నవి? కేవలం వీటి ద్వారా ప్రభుత్వాలకు వచ్చే ఆదాయమే కొలమానమా? ఇది పెద్ద మాఫియాగా మారడం, హవాలా రూపంలో డబ్బును చలామణీ చేయడం, ఇవి ప్రభుత్వాలనే శాసించే స్థాయికి వెళ్లాయంటే దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎంత బలమైనవారో ఊహించవచ్చు! కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశభక్తి గురించి నిత్యం వల్లె వేస్తూ వుంటుంది. మరి యువత ఈ బెట్టింగ్, జూదం యాప్‌ల ద్వారా నాశనమైపోతుంటే పట్టనట్లుండడం ఏం దేశభక్తి? ఇటువంటి వాటిని నిషేధించవద్దని ఎవరూ చెప్పలేదు. మరి ఎందుకు నిషేధించడం లేదు? అనేక దేశాల్లో 1949 లోనే ఇటువంటి బెట్టింగ్, జూదాలను సంఘ విద్రోహ చర్యలుగా పరిగణించి నిషేధించాయి. మన దేశంలో కూడా దేశవ్యాప్తంగా ఒకే చట్టం రావాలి. వీటిని అడ్డగోలుగా ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వీటి సూత్రధారులను, మోసగించి విదేశాలకు పారిపోయిన వారిని దేశంలోకి రప్పించి వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి. యువత బెట్టింగ్, జూదం, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా పరివర్తన కలిగించాలి. యువతకు ఉపాధి కల్పనపై ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలి. కుటుంబాల్లో కూడా ఇటువంటి జూదాల జోలికి వెళ్లకుండా రెగ్యులర్‌గా కనిపెట్టుకుంటూ ఉండాలి. అప్పుడే యువతను ఈ బెట్టింగుల నుండి కాపాడుకోగలం.

# కమనీయం రామయ్య కళ్యాణానికి



అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్ గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచే వారు . 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్‌లో వేములవాడ , భద్రాచలం తెలంగాణలోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, భద్రాచలం మండలంలోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం అనే పేర్లుతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది.పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీ రాముడుకి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరం పొందాడని అంటారు. ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర ం అచలం) అని పేరు స్థిరపడింది. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పని చేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వా నికి జమ చెయ్యకుండా,1645 - 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశమందు రామాలయాన్ని నిర్మించాడు. సీతా రామ చంద్ర స్వాములకు రకరకాల నగలు - చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి.గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగించిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది. దేవాలయమందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామ చంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానం లోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్స వానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్స వానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామ దాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శనశాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు. భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాల సందడి ఊపందుకుంది. కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణ బ్రహ్మోత్సవాల్లో 6న కల్యాణం, 7న పట్టాభిషేకం నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భద్రాచలం పట్టణాన్ని అందంగా ముస్తాబు చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. రామాలయానికి, మిథిలా స్టేడియానికి రంగులు వేసి విద్యుత్ లైట్లను అలంకరించారు. రాములోరి కళ్యాణం, పట్టాభిషేకం జరిపే మిథిలా ప్రాంగణంలో సెక్టార్ల వారీగా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది. ఇప్పటికే అధికారులు శ్రీరామనవమి వేడుక నిర్వహణపై పలుమార్లు దేవస్థాన ఈవో రమాదేవి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు కల్యాణ మహోత్సవంలో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. సాధారణంగా రోజువారి నిత్య కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు పసుపు రంగులో ఉంటాయి. అయితే ఏడాది కోసారి నిర్వహించే కల్యాణ మహోత్సవాల్లో మాత్రం తలంబ్రాలు ఎరుపు రంగులో ఉంటాయి. భద్రాద్రిలో ఈ తలంబ్రాలను ప్రత్యేకంగా తయారు చేస్తారు. బియ్యంలో పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్కా, గులాములు, సుగంధ ద్రవ్యాలు కలిపి తలంబ్రాలను తయారు చేస్తారు. ఇలా తలంబ్రాలను తయారు చేయడం భక్త రామదాసు కాలం నుంచి ఆచారంగా వస్తోంది. గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులు.. వడ్లను గోటితో వలిచి సీతారాముల కల్యాణంలో వినియోగించేందుకు భద్రాచలం తీసుకువస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా, వరంగల్, కరీంనగర్, కొత్తగూడెం, మణుగూరు, హైదరాబాద్?లోని భక్తులు గోటితో వలిచిన వడ్లను స్వామివారికి సమర్పిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భద్రాద్రి రామయ్యకు కోటి గోటి తలంబ్రాలు సమర్పిస్తున్న మహిళలు ఈ ఏడాది 2 క్వింటాళ్ల వడ్లను వలిపించి భద్రాద్రి సన్నిధికి అందించారు. ఈనెల 6న జరగనున్న సీతారాముల కళ్యాణం మహోత్సవంలో ఈ కళ్యాణ తలంబ్రాలను వాడనున్నారు. శ్రీరామనవమి రోజున తలంబ్రాలకు 60 కౌంటర్లు, ప్రసాదాలకు 19 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ముత్యాల తలంబ్రాల పొట్లాలను ఆర్టీసీ కార్గో, ద్వారా బుక్ చేసుకున్న వారికి పంపిస్తారు. నేరుగా కౌంటర్ల లోనూ విక్రయించ నున్నారు. ఈ ఏడు రాష్ట్ర ప్రభుత్వం 2.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆన్‌లైన్‌లో సైతం భక్తులు కళ్యాణోత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ ఏడు ఏప్రిల్ 5న ఎదుర్కోలు, 6న కళ్యాణం, 7న పట్టాభిషేకం, 8న సదస్యం, 9న తెప్పోత్సవం, 10న ఓంజల్ సేవ, 11న వసంతోత్సవం, 12న చక్రతీర్థం పుష్పయాగం నిర్వహించ బడతాయి.తద్వారా బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రప్రథమంగా ప్రభుత్వ పక్షాన పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించ నున్నారు.

# తీర ప్రాంత పరిరక్షణలో నౌకాదళ అసమాన సేవలు



భారత దేశంలో క్రి.పూ.2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్ట మొదటి నౌకాతీరం నిర్మించబడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధానమంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్థ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటిష ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది నిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవిగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు. 1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లోఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ధ్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్ - రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి. భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం, భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలీకాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం. భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్రపరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఉమ్మడి వ్యాయా మాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికాదళంలో భాగం. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ - విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ - ముంబాయి దక్షిణ కమాండ్ - కోచి, అండమాన్ నికోబార్ నావల్ - పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకాదళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టార్ఫిడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ - ఐ ఎన్ ఏస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకాదళంలో ప్రవేశపెట్ట బడిన తొలి జలాంతర్గామి - ఐఎన్ఏస్ కల్వరి.

# యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో బి.ఎన్.ఐ ఎప్పుడు ముందంజలో ఉంటుంది ప్రణీత్ పెనుమాడు

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో బి.ఎన్.ఐ ఎప్పుడు ముందంజలో ఉంటుంది అని ప్రణీత్ పెనుమాడు అన్నారు.శుక్రవారం,తిరుపతిలో స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు హెూటల్లో తిరుపతి శాఖ,బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బి.ఎన్.ఐ) బిల్లియనీర్స్ వారి సమావేశానికి ఎడిఫై స్కూల్స్ అధినేత, ప్రణీత్ ఫౌండేషన్ ఫౌండర్, ప్రణీత్ పెనుమాడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన ప్రణీత్ పెనుమాడు కు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమ నిర్వాహకులు ప్రణీత్ పెనుమాడును దుస్సాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణీత్ పెనుమాడు మాట్లాడుతూ తిరుపతి శాఖ, బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బి.ఎన్.ఐ) బిల్లియనీర్స్ అధ్యక్షుడు డాఎం వంశీకృష్ణ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. యువ వ్యాపారవేత్తలకు బి.ఎన్.ఐ మార్గదర్శినిగా పనిచేస్తుందని కితాభిచ్చారు. వ్యాపారవేత్తల వ్యాపార అవకాశాలను మెరుగు పరచడంతో పాటుగా బి.ఎన్.ఐ సంస్థ వారు సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.బి.ఎన్.ఐ లో భాగస్వాములుగా ఉన్న ప్రతి ఒక్క సభ్యుడు వ్యాపార పరంగా ఎదగాలని



అవకాశం కల్పిస్తున్న బి.ఎన్.ఐ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి శాఖ,బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బి.ఎన్.ఐ) బిల్లియనీర్స్ ముఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీకి రెండు మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వ్యాన్లు విరాళం





**ఏప్రిల్ 4, (ప్రజా జ్యోతి ) తిరుపతి జిల్లా ప్రతినిధి**

తిరుమల శ్రీవారికి శుక్రవారం బెంగళూరులోని ఎం.ఎస్.రామయ్య విద్యా సంస్థలకు చెందిన ఎం.ఎస్.సుందర్ రామ్ అనే భక్తుడు అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు రూ.45 లక్షల విలువైన అశోక్ లేల్యాండ్ కంపెనీకి చెందిన రెండు బడా దోస్త్ మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వ్యాన్లను విరాళంగా అందించారు. ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనం తాళాలను టీటీడీ అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ ఈ అత్యాధునిక వాహనాలు భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో కూడా క్యూలైన్ల వెంబడి ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేసేందుకు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ వాహనాలతో ఒకేసారి 3వేల మందికి అన్న ప్రసాదాలు పంపిణీ చేయవచ్చన్నారు. ఈరోజు నుండి ఈ వాహనాలను వినియోగించనున్నట్లు వెల్లడించారు. దాతలు ప్రస్తుతం రెండు వాహనాలను విరాళంగా ఇచ్చారని, మరో వాహనం డిజైనింగ్ లో ఉన్నందున త్వరలో అందివ్వనున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా దాతలను అదనపు ఈవో అభినందించారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్ పోర్ట్ డిపో మేనేజర్ లక్ష్మీ ప్రసన్న, ఇన్ ఛార్జ్ డీఐ హరిబాబు,

# ఏప్రిల్ 5న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- ఏప్రిల్ 6న ధ్వజారోహణం
- ఏప్రిల్ 6, 7వ తేదీలలో కవి సమ్మేళనం

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి/ఒంటిమిట్ట**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 5న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించను న్నారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, ఎండవేడిని తట్టుకునేలా చలువపందిళ్లు ఏర్పాటుచేశారు. ఆలయ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయ గోపురాలు, కల్యాణవేదిక, ఇతర ప్రాంతాల్లో పుష్పాలంకరణలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, విద్యుత్ కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేశారు.

**ఏప్రిల్ 6న ధ్వజారోహణము**

ఏప్రిల్ 6న ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవ జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6న శ్రీ రామనవమి, ఏప్రిల్ 9న హనుమత్సేవ, ఏప్రిల్ 10న గరుడసేవ జరగనున్నాయి. ఏప్రిల్ 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. ఏప్రిల్ 12న రథోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఏప్రిల్ 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

**కవి సమ్మేళనం :**

శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి



పర్వదినం, శ్రీ పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీ సాయంత్రం 4 నుండి రాత్రి 7 గంటల వరకు పోతన భాగవతం అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 7వ తేదీ రామయాణంలోని కాండలపై కవి సమ్మేళనం జరుగుతుంది.

**ఆలయ చరిత్ర**

ఈ ఆలయానికి పురాతన, చారిత్రక ప్రాశస్త్యం ఉంది. ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తులు ఉండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని కూడా అంటారు.పురాణాల ప్రకారం ఆలయ చరిత్ర ఇలా ఉంది. శ్రీమహావిష్ణువు త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా అవతరించాడు. సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో సంచరిస్తుండగా సీతాదేవి దప్పిక తీర్చేందుకు భూమిలోనికి బాణం వేయగా నీరు బుగ్గ పుట్టింది. అదే ఒంటిమిట్ట రామతీర్థం అయింది. సీతాన్వేషణ కోసం జాంబవంతుడు సహకరించాడు. ఆ జాంబవంతుడు సేవించిన సీతాలక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే ఒంటిమిట్ట గుడిలో కొలువై ఉన్నాడు.

**శాసనాల ప్రకారం :**

ఈ ఆలయాన్ని మూడు దశల్లో నిర్మించారని, 14వ శతాబ్దంలో నిర్మాణం ప్రారంభమై 17వ శతాబ్దంలో పూర్తయిందని ఇక్కడున్న శాసనాల ద్వారా తెలుస్తోంది. ఉదయగిరిని పాలించిన కంపరాయలు ఈ ప్రాంతంలో ఒకసారి సంచరిస్తాడు. వేట మీద జీవనం సాగించే వంటడు, మిట్టడు ఇక్కడికొచ్చిన కంపరాయలకు, ఆయన పరివారానికి శ్రీరాముడు సృష్టించిన బుగ్గనీటితో దప్పిక తీరుస్తారు. వీరిరువురి కోరికపై కంపరాయలు ఆలయాన్ని నిర్మించి ఒంటిమిట్ట గ్రామాన్ని ఏర్పాటుచేస్తాడు. క్రీ.శ 1356లో బుక్కరాయలు ఈ ఆలయాన్ని ప్రారంభించాడు.

ఆ తరువాత కాలంలో విజయనగరరాజులు, మట్లిరాజులు క్రమంగా గుడికి అంతరాళం, రంగమండపం, మహాప్రాంగణం, గోపురం, రథం నిర్మించారు. ఒంటిమిట్ట చుట్టుపక్కల గ్రామాల రాబడిని ఆలయ కైంకర్యాలకు వినియోగించారు. వావిలికొలను సుబ్బారావు భిక్షాటన చేసి విరాళాలు సేకరించి ఆలయానికి పూర్వ వైభవం తెచ్చారు.

**రాములవారిపై సాహిత్యం :**

ఎందరో మహాకవులు తన సాహిత్యం ద్వారా శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులయ్యారు. పోతన ఇక్కడే భాగవతాన్ని అనువదించినట్టు తెలుస్తోంది. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట రఘువీర శతకం చెప్పారు. రామభద్రుడు 'రామాభ్యుదయం' రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పు గొండూరు వేంకటకవి ఒంటిమిట్ట రశరథరామ శతకం చెప్పారు. వావిలికొలను సుబ్బారావు ఆంధ్రవాల్మీకి రామాయణాన్ని మందర వ్యాఖ్యతో రచించారు. తాళ్లపాక అన్నమయ్య రామునిపై పలు సంకీర్తనలు ఆలపించారు.

## విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన పెంచలయ్య పై పోక్సో యాక్ట్ కేసు నమోదు చేయాలి..

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని.



**బద్వేల్ ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలోని ఏ వి ఆర్ స్కూల్ లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య ఆరో తరగతి విద్యార్థునిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన పెంచలయ్య పై ఫోక్స్ యాక్ట్ కేసు నమోదు చేయాలని అలాగే ఏవిఆర్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. ఈరోజు ఉదయం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏ వి ఆర్ స్కూల్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ... మొన్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన మరువకముందే ఇప్పుడు ఏ వి ఆర్ స్కూల్ లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ ఆరో తరగతి చదువుతున్న విద్యార్థినిలపై అసభ్యంగా ప్రవర్తించడం చాలా దారుణమైన విషయం అన్నారు. విద్యాశాఖ అధికారులు అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రైవేట్ పాఠశాలలో నిత్యం ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఏ వి ఆర్ స్కూల్ లో ఇటువంటి సంఘటన జరిగిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో వరసగా జరుగుతున్న సంఘటనలపై ఉన్నత అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని స్కూల్లో విద్యార్థులపై లైంగికంగా అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులను తొలగించడమే కాకుండా మరో మారు ఇటువంటి సంఘటన జరగకుండా ఉండాలంటే తక్షణమే స్కూల్ గుర్తింపును రద్దు చేస్తే తప్ప ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. క్వాలిఫికేషన్ లేనటువంటి ప్రైవేట్ ఉపాధ్యాయులను టీచర్స్ గా తీసుకునే ముందు వారి ప్రవర్తన నడవడికను బట్టి క్వాలిఫికేషన్ బట్టి తీసుకోకుండా తక్కువ జీతాలు ఇచ్చి ఇలాంటి వారిని ఉపాధ్యాయులుగా చేర్చుకోవడం జరుగుతుందని కాబట్టి ముందుగా స్కూలు గుర్తింపును రద్దు చేస్తే ఇటువంటి సంఘటనలు జరగడానికి భయపడతారన్నారు. తక్షణమే విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్యను అరెస్టు చేసి అతనిపై పోక్సో చట్టం కింద కేసులో నమోదు చేయాలని ఇటువంటి స్టాఫ్ ని ఏర్పాటు చేసుకున్నటువంటి ఏవిఆర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సంఘటనలపై జిల్లా ఉన్నతాధికారులు పాఠశాల గుర్తింపులు రద్దు చేయకపోతే డివైఎఫ్ఐ యువజన సంఘం మిగతా సంఘాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్ ,బద్వేల్ అధ్యక్ష కార్యదర్శులు ముడమాల ఓబుల్ రెడ్డి ,ఉప్పలూరు బాల గురయ్యా, పట్టణ నాయకులు శ్రీనివాసులు, షఫీ ,మా భాష తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిదవ తేదీన కడప నగరంలో జరగనున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నిర్మాణ మహాసభను జయప్రదం చేయండి.




**బద్వేల్ ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి న్యూస్)**

ఈనెల 8వ తేదీ మంగళవారం నాడు కడప నగరంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవనం నందు జరగనున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నిర్మాణ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం స్థానిక బద్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయం నందు మహాసభ కరపత్రాలను పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ సంగటి చంద్రశేఖర్ వారి పార్టీ నాయకులతో కలిసి విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంగటి చంద్రశేఖర్ మాట్లాడుతూ, భారతదేశంలో 1975 వ సంవత్సరంలో పార్టీ ఏర్పడి అనేక ఉద్యమాలలో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన చరిత్ర సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీదని, ఉత్తర భారత దేశంలో పార్టీ నడిపిన రాజీలేని పోరాటాల కారణంగా నేడు బీహార్ ఝూర?ండ్ మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో శాసనసభ్యులను మరియు ఇతర లోక్సభ సభ్యులను కలిగి ఉండి ప్రజల మన్నలను పొందినదని వారు తెలియజేశారు. కానీ నేడు రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మరియు నారా లోకేష్ గారి పాదయాత్ర సందర్భంగా రాయలసీమ ప్రాంతానికి అందులో కడప జిల్లాకు అనేక హామీలు ఇచ్చారని కడప జిల్లాలోని సాగు తాగునీటి ప్రాజెక్టులను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాయలసీమలో పచ్చదనాన్ని నింపుతామని అలాగే కడప ఉక్కు పరిశ్రమ పనులను తక్షణమే ప్రారంభిస్తామని హామీలు ఇచ్చి నేటికి పది నెలలు పూర్తవుతున్న ఏ ఒక్క హామీకి నాంది పలుకకపోవడం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నదని వారు విమర్శించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధుల సాధన కోసం ఈ మహాసభ వేదికగా భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించుకొని ముందుకు వెళ్లడానికి ఈ మహాసభలో చర్చించి తీర్మానాలు చేయబోతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రమోహన్ రాజు, జకరయ్య నియోజకవర్గ పార్టీ నాయకులు రామరాజు, విజయరావు, అనిల్, బాబు, నారాయణ, జైపాల్, చంద్రపాల్, కదిరయ్య, పాండు, చెన్నయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి 129 కళాశాలతో కలశా భిషేకం.

**పాలకొల్లు. ప్రజాజ్యోతి.( కొట్టి రామం ) ఏప్రియల్ 4.** పాలకొల్లు గీతా మందిరంలో శుక్రవారం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి స్వామి రామానంద గిరి మహారాజ్ ఆద్వర్యంలో శ్రీ సూక్త పారాయణ కలశోక్తంగా 129 కలశాలతో కలశాబిషేకం జరిగింది. సుమారు 200 మంది మహిళలు భక్తి శ్రద్ధలతో కలశాబిషేకంలో పాల్గొన్నారు. రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెసు పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. జోగాడ ఉమామహేశ్వరరావు. మామిడిశెట్టి చిట్టిబాబు పెచ్చేట్టి కృష్ణాజి ,గొర్రెల రాంబాబు రామాంజుల చిన మదు వీరా మల్లికార్జునుడు కుమారి హేమలత హైమావతి తదితరులు పాల్గొన్నారు.



# రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిప్యూటీ తాసిల్దార్ కు వినతి

**కణేకల్లు ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి):**

రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎన్డీఏ కూటమి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ ఫిక్స్ పథకాలు కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కణేకల్ మండలం డిప్యూటీ తాసిల్దార్ కీ రైతుల సమస్యల డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మల్లయ్య మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల ని,కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన సూపర్ 6 హామీలను వెంటనే అమలు చేయాలి.అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి సంవత్సరం రూ “ 20,000/ లు పెట్టుబడి సాయం కింద వెంటనే ఇవ్వాలి,కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం తక్షణమే సమగ్ర కౌలు చట్టాన్ని చేయాలి.హంద్రీ-నీవా లైనింగ్ పనుల కొరకు విడుదల చేసిన జీవో 404,405 రద్దు చేసి వెంటనే లైనింగ్ పనులు ఆపాలి,హంద్రీ-నీవా కాలువ ను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలి,హెచ్.ఎల్.సి కీ సమాంతర కాలువ నిర్మించాలి,ఇళ్లస్థలాలు లేని నిరుపేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు భూమి ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలి, ఇంటి నిర్మాణం కొరకు 5,00,000/- లు కేటాయించాలి. పై సమస్యలు పరిష్కారం కొరకు కూటమి ప్రభుత్వం అమలు చేయాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతులను కలుపుకొని ఉద్యమానికి శ్రీకారం



తుడుతామని అఖిల భారత రైతు కూలి సంఘంగా ఈ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు చిక్కన్న కణేకల్ మండలం పి డి ఎస్ యు అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్, ఏఐకేఎంఎస్ నాయకులు తిప్పన్న,దుర్గన్న,కిష్టప్ప, గోపాల్,రాము,నాగరాజు, శీనప్ప,మల్లికార్జున,తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్స్ కాలేజీ అఫ్ ఫిజ్యోథెరపీ ఆధ్వర్యంలో వర్కుషాప్





శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలో మైయోఫేషియల్ నొప్పికి ట్రిగ్గర్ పాయింట్ థెరపి “ మైయోఫేషియల్” అనే అంశంపై 03.04.2025 04.04.2025వ తేదిలలో స్విమ్స్ శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు వర్క్ షాప్ నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా? రామ్ తెలియజేశారు. పౌండర్ డైరెక్టర్ ఆఫ్ సినర్జీ ఫిజియో కేర్ %ఉ% రెహాబ్ సెంటర్ చెన్నై నగరం నుంచి హాజరయిన డా? సురేష్ ఫ్రాన్ కిన్ , కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డా? మాధవి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పౌండర్ , డైరెక్టర్ ఆఫ్ సినర్జీ ఫిజియో కేర్ %ఉ% రెహాబ్ సెంటర్ చెన్నై నగరం నుంచి హాజరయిన డా? సురేష్ ఫ్రాన్కిన్ గారు మాట్లాడుతూ... మైయోఫేషియల్ చికిత్స అనేది మీ కణజాలం అంతటా బిగితు మరియు నొప్పిని విడుదల చేసే సున్నితమైన, స్థిరమైన మసాజ్ అని పేర్కొన్నారు. ముందుగా మీ ఆరోగ్య సంరక్షణ ప్రదాత మీ ఫాసియల్ కణజాలంలో ట్రిగ్గర్ పాయింట్లు లేదా నాట్ లను కనుక్కొని తర్వాత వారు ఒత్తిడిని తగ్గించే వరకు సున్నితంగా మర్దన చేస్తారని తెలియజేశారు. స్విమ్స్ కాలేజీ అఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డా? మాధవి మాట్లాడుతూ... ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అంగీకరించిన స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా? ఆర్.వి. కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మైయోఫేషియల్ నొప్పి ట్రిగ్గర్ పాయింట్ థెరపీ అనేది కండరాలలోని నిర్దిష్ట బిగితుపై దృష్టిసారించి నొప్పిని తగ్గించేందుకు మరియు కండరాల పనితీరును మెరుగుపరిచేందుకు ఫిజియోథెరపీలో ఉపయోగించే ఒక చికిత్సా విధానం అని, ఇలాంటి లైవ్ వర్క్ వలన విద్యార్థిని, విద్యార్థులు ఫిజియోథెరపీలో అవగాహన పెంచుకోవడానికి ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజియోథెరపి కళాశాల అధ్యాపకులు. విద్యార్థు లు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలియజేశారు. కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి డా? సెంథిల్ కుమార్ ఈ వర్క్ షాప్ కు కో-ఆర్డినైటర్ గా వ్యవహరించడం జరిగింది.

# దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాల కీలక పాత్ర

**మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వ.**

**ఏప్రిల్ 4, (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, జాతీయ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు,చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఈ నేపథ్యంలోనే మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ పార్లమెంటులో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు హాజరైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు..., శుక్రవారం లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో స్వయం సహాయక పొదుపు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, ఉపాధి అవకాశాలు.., దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు పోషిస్తున్న కీలక పాత్ర..గత ఐదేండ్లతో పాటు ఈ సంవత్సరానికి సంబంధించిన వివరాలను కేంద్ర మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి తోహన్ సాహును అడిగి తెలుసుకునే ప్రయత్నం చేసారు. దీనికి సంబంధిత శాఖ సానుకూలంగా స్పందించడమే కాకుండా ..,తాను కోరిన అంశానికి



సంబంధించి వివరాలను కూడా లిఖిత పూర్వకంగా అందజేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మీడియాకు వెల్లడించారు. స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలను అన్ని రకాల ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని ఆయన తెలియజేశారు. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్కు అధిక ప్రాధాన్యత ఇస్తూ.. మహిళలను మహరాణులుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. అన్ని రకాల రాణిస్తూ.. నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.., సమాజంలో తామేంటో రుజువు చేస్తున్న.. స్వయం సహాయక పొదుపు సంఘాల ద్వారా భారత సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే ధ్యేయంతో పనిచేస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మహిళల శ్రేయస్సు కోసం సంస్కరణలు తీసుకొచ్చి చేయూతనిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మానసపుత్రికగా కొనియాడబడుతున్న స్వయం సహాయక పొదుపు సంఘాలకు ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అందరికీ తెలిసిన విషయమని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు..., చంద్రబాబు నాయుడు కలలను సాకారం చేసే దిశగా కేంద్రం ప్రభుత్వం ఈ బడ్జెట్లో కెటాయింపులు జరపడం ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సితారామన్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారాయన.

## వక్ఫ్ సవరణ బిల్లు బిజెపి హిందుత్వ ఎజెండాలో భాగమే. సిపిఎం

**పోదూరు /పెనుగొండ, ఏప్రిల్ 4,ప్రజాజ్యోతి న్యూస్.**

వక్ఫ్ సవరణలను బీజేపీ యొక్క హిందుత్వ ఎజెండాలో భాగమే అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు . శుక్రవారం పెనుగొండ జామియా మసీదు వద్ద జరిగిన నిరసనల్లో ఆయన మాట్లాడుతూ ఈ సవరణలను మైనారిటీల మత స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు.రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ (ఆర్టికల్ 25) కింద ముస్లింలు తమ ఆస్తులను వక్ఫ్ బోర్డుల ద్వారా నిర్వహించుకునే హక్కును ఈ సవరణలు కాలరాస్తాయని విమర్శించారు.వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించడం, కలెక్టర్లకు ఆస్తులపై నిర్ణయాధికారం ఇవ్వడం మైనారిటీల ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది అన్నారు. దేశవ్యాప్తంగా 9.4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వక్ఫ్ ఆస్తులు ప్రమాదంలో పడతాయని అనుమానం వ్యక్తం చేశారు. సిద్ధాంతం గ్రామ మసీదు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పెనుగొండ మండల సిపిఎం పార్టీ కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తి తగ్గడం ద్వారా వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చడం, ఆస్తి గుర్తింపులో ప్రభుత్వ జోక్యం పెరగడం వల్ల ఈ సంస్థల స్వతంత్రత దెబ్బతింటుందని అన్నారు. ఇది మోడీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అణచివేతకు దారి తీస్తుందని విమర్శించారు. ఈ బిల్లును రాజ్యాంగ విరుద్ధమైనదిగా, మైనారిటీ హక్కులను హరించేదిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ



జామియా మసీద్ అధ్యక్షులు షేక్ నాగూర్ మీరా, కార్యదర్శి రెడీమేడ్ భాషా, షేక్ సుజాయుద్దీన్, షాకీర్ బాయ్, ఎస్కే షరీఫ్, సిద్ధాంతం గ్రామ మసీదు అధ్యక్షుడు షేక్ అమిన్, ఎండి షాన్ వెష్, సిపిఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, కదలి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తిరుపతి శ్రీ కోదండరాముడి చక్రస్నానం..

ముగిసిన బ్రహ్మోత్సవాలు..





**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శుక్రవారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ముందుగా ఉదయం 7.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు పల్లకిలో కపిలతీర్థానికి వేంచేశారు. ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయ మండపంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకాలు అందుకుని ప్రసన్నులయ్యారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ఆ తరువాత అక్కడినుండి స్వామివారు శ్రీ గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలోని పి.ఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం అక్కడి నుండి బయలుదేరి తీర్థకట్ట వీధి, కోటకొమ్మల వీధి, కొత్తవీధి మీదుగా శ్రీ కోదండరామాలయానికి చేరుకుంటారు. మధ్యలో శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం, శ్రీవైఖానసాచార్యుల ఆలయంలో ఆస్థానం నిర్వహించనున్నారు.

## పూర్ణాహూతితో ముగిసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ధ్వజస్తంభం సంప్రోక్షణ



**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభం సంప్రోక్షణ పూర్ణాహూతితో శాస్త్రోక్తంగా ముగిశాయి.
ఆలయ అర్చకులు శ్రీ సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు మహా పూర్ణాహూతి, కుంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శివకుమార్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్లు చొప్పున జైలు శిక్ష

ఒకొక్కరికి రూ. 6లక్షల జరిమానా

తీర్పు వెల్లడించిన ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**




ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష తలా రూ.6 లక్షల జిరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పువెల్లడించింది. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ చీఫ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణను అమలులో భాగంగా టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదై విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను పగడ్బందీగా నిరూపించి ముద్దాయిలకు శిక్ష పడేలా ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా క్రైమ్ నెంబరు 06-2020లో కరకంబాడి బీటు, తిరుపతి రేంజి పరిధిలో పట్టుబడ్డ ప్రకాశం జిల్లాకు చెందిన చెరబోయిన వెంకటరమణ, పింజరి మహబూబ్ బాషా ఇద్దరు ముద్దాయిలు చేసిన నేరం రుజువయ్యింది. దీంతో తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహ మూర్తి ఒకొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాల మేరకు వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారులు అభినందించారు. శేషాచలం రిజర్వు ఫారెస్టులో అత్యంత విలువైన సహజ సంపద ఎర్ర చందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేసే నేరస్తులకు ఈ తీర్పు ఒక హెచ్చరికగా పని చేస్తుందని టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

# జీవితంలో అత్యంత ప్రాముఖ్యత గలది కళాశాల విద్య.





పాలకొల్లు ప్రభుత్వ డిగ్రీ కాలేజి వార్షికోత్సవ వేడుకలలో డా యస్ శోభారాణి.

**పాలకొల్లు. ప్రజా జ్యోతి. (కొట్టి రామం.)**

జీవితంలో కళాశాల విద్య అత్యంత ప్రాముఖ్యమైనదని మనిషి ఏదైనా సాధించాలంటే ఈ దశ ముఖ్య పాత్ర పోషిస్తుందని కళాశాల విద్య జోన్ 1 మరియు జోన్ 2 ప్రాంతీయ సంచాలకులు డా యస్ శోభారాణి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లోని ఎ యస్ యన్ యం ప్రభుత్వ డిగ్రీ కాలేజి (స్వయం ప్రతిపత్తి ) 58 వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శ్రీ నందుల బుచ్చిరామయ్య కళావేదిక పై జరిగిన వార్షికోత్సవ సభలో శోభారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ దశలోనే విద్యార్థి తన గురుంచి తాను తెలుసుకొని ఎదగాలన్నారు.ప్రతి మనిషికి పరాజయాలు ఎదురవుతుంటాయని ఆ పరాజయం నుండే విజయాలు సాధించాలన్నారు.మన లక్ష్యం కోసం ప్రణాళిక సిద్ధం చేసుకొని ఎవరైతే ముందుకు నడుస్తారో వారే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు.అబ్దుల్ కలాం ,స్వామి వివేకానంద ,నెల్సన్ మండేలా లాంటి మహానీయుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తిపొందాలన్నారు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేదేలేదని శ్రీశ్రీ చెప్పారని అబ్దుల్ కలాం మనిషి శ్రమపడి చెమట బిందువులు చిందిస్తే అమృతం లాంటి జీవితం దొరుకుతుందని పేర్కొన్నారని అటువంటివారి



మాటలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కళాశాలలో మంచి సౌకర్యాలతో పాటు ఉన్నత విద్యార్హతలు గల అధ్యాపకులున్నారని వీటిని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

సభా కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిధులుగా పాలకొల్లు డి యన్ ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా పి శోభ,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ టి కృష్ణ ,ఐ క్యూ ఏ సి కో ఆర్డినేటర్ శ్రీ కె భద్రాచలం ,స్టూడెంట్ కౌన్సిల్ సమన్వయకర్త డా యం రామకృష్ణ ,సి పి డి సి సెక్రటరీ డా రాఘవయ్య ,అకాడమిక్ కో ఆర్డినేటర్ డా యామిని పాల్గొన్నారు.తొలుత జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభించారు.అనంతరం మాజీ ఉప ప్రధాని దివంగత నేత శ్రీ బాబు జగజ్జీవనరావు జయంతి ని పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి కళాశాల 2024 -2025 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రగతిని ,సాధించిన విజయాలను ,అధ్యాపకులు విద్యార్థులు కళాశాల అభివృద్ధికి ఏ విధంగా దోహదపడ్డారో తమ సమగ్ర నివేదికలో అతిధులకు ఆహ్వానితులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో 8వ తేదీన జాతీయ స్థాయి మేధో సంపత్తి హక్కులపై జరగబోయే శిక్షణా శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని, కళాశాల లో మొదటి సంవత్సరం డిగ్రీ మరియు పి జి కోర్సులకు సంబంధించిన ప్రవేశ కరపత్రాన్ని ప్రాంతీయ సంచాలకులు ఆవిష్కరించారు.తదనంతరం 2023 -2024 విద్యా సంవత్సరానికి సంభందించిన తృతీయ సంవత్సరం ఉతీర్ణులైన మొదటి మరియు రెండో స్థానం సాధించిన విద్యార్థులకు,క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేసారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహించబడ్డాయి.ఇందులో భాగంగా సంప్రదాయ కోలాటాలు,జానపద నృత్యాలు విద్యార్థులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు డా బూసి వెంకటస్వామి ,శ్రీ యన్ వి డి దినకరన్ , డా చెట్టి ఉషారాణి,డా వి విజయలక్ష్మి,పి శ్రీనివాసరావు,జి మహేష్ ,సి హెచ్ రవికుమార్, పి కె వి రామలక్ష్మి ,డి మన్మధరావు ,జి డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# పారదర్శకంగా టీడీఆర్ బాండ్ల
# దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ






టీడీఆర్ మేళాకు విశేష స్పందన. కమిషనర్ ఎన్.మౌర్య

**ఏప్రిల్ 4, (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధృవీకరణ జరుగుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో టిడిఆర్ బాండ్ల దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మేళాను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి త్వరితగతిన టిడిఆర్ బాండ్లు ఇచ్చేందుకు వారం రోజుల పాటు ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మేళాకు విశేష స్పందన లభిస్తోందని అన్నారు. భూములు కోల్పోయిన వారి దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తున్నామని అన్నారు. అటు తరువాత కమిటీ పరిశీలించి ఎండార్స్మెంట్ ఇస్తామని, తరువాత గిఫ్ట్ డీడ్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో ఎక్కువ మంది నివాస యోగ్యమైన స్థలాలకు కమర్షియల్ డోర్ నంబర్ తో రిజిస్టర్ చేశారని అన్నారు. అటువంటి వాటిని, సరైన ధృవ పత్రాలు జతపరచని వాటిని షార్ట్ ఫాల్ చేయడం జరిగిందని అన్నారు. వీరందరూ సరైన ధ్రువపత్రాలతో వస్తే ఆన్లైన్ చేయడం జరుగుతుందని అన్నారు. భూతగాదాలు ఉన్న వాటిని మరోమారు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఈ గిఫ్ట్ డీడ్ చేయించే విషయాలను తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్టర్ లకు తెలపడం జరిగిందని అన్నారు. మొదటి విడత తొమ్మిది దరఖాస్తులు పరిశీలించగా ఎనిమిది సరైన ధృవ పత్రాలు లేకపోవడంతో షార్ట్ ఫాల్ పెట్టామని అన్నారు. అన్ని దరఖాస్తులు సక్రమంగా ఉండి, వ్యాపార యోగ్యమైన భవనం పోవడంతో జబ్బర్ లే ఔట్ నందు ఒకటి టిడిఆర్ బాండు మాత్రం ఇచ్చామని తెలిపారు. ఈ మేళాను భూములు కోల్పోయిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని టీడీఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలించి, మాస్టర్ ప్లాన్ రోడ్ల వారీగా వివరాలు సేకరించారు. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలన, వాలి డేషన్, రిజిస్ట్రేషన్ చేసే విధానంపై వివరించారు. ఈ మేళాలో తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లు, డీసీపీ మహాపాత్ర, ఏసిపి లు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


## బాల్యం నుండే విద్యార్థులు స్నేహ భావంతో మెలిగేలా విద్యార్థుల ఫోటోలతో వినూత్న ప్రదర్శన



**తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం, ఏప్రిల్4, ప్రజాజ్యోతి న్యూస్**

మండల కేంద్రమైనతాళ్లపూడి లోని మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో వినూత్న రీతిలో యూ.కె.జి, మరియు ఎల్.కె.జి చిన్నారుల ఫోటోలను పువ్వుల రూపంలో వివిధ రంగులలో చూడముచ్చటగా వరుస క్రమంలో అలంకరించారు. గతంలో ఏ స్కూల్ యాజమాన్యం ఊహించని రీతిలో చిన్నారుల ముఖ చిత్రాలను వివిధ రంగులలో అమర్చారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వి.వి. అనీష్ మాట్లాడుతూ చిన్ననాటి నుండి విద్యార్థులలో ఐకమత్యాన్ని పొందుపరిచేందుకు ఇటువంటి వినూత్న రీతిలో చూపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

## స్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించిన గుమ్మనూరు నారాయణ స్వామి,గుమ్మనూరు శీనప్ప




**గుంతకల్లు ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి):**

పట్టణంలోని పాత బస్టాండ్ మెయిన్ రోడ్ లో టిడిపి నాయకులు పెంచలపాడు వెంకటేష్ నూతన స్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను శుక్రవారం ప్రారంభించారు.ఈ రెస్టారెంట్ ను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శీనప్ప చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం రెస్టారెంట్లోని దేవుడి చిత్రపటాల పూజా అనంతరం జ్యోతులను వెలిగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నూతన స్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రజలు ఆశీర్వదించి దినదినంగా అభివృద్ధి చెంది అంచలంచ లుగా ఎదగాలని అన్నారు.ఈ నూతన స్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మరియు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బిఎస్ కృష్ణారెడ్డి,టిడిపి వాల్మీకి సాధికార జిల్లా అధ్యక్షులు దాసరి ప్రతాప్ నాయుడు, పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్,టిడిపి కౌన్సిలర్ ఉడుదాల ప్రభాకర్,ఆలర్పి వీరేష్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దిమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయుల సమ్మేళనం

**ప్రజా జ్యోతిరిపోర్టర్ సుబ్బు పామిడి**



అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి గ్రామలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో గెట్ టుగెదర్ 2005 2006 బ్యాచ్ మా స్నేహితులతో మా స్కూల్ నందు స్నేహితులతో మా టీచర్స్ తో కలిసి ఎన్నో సంవత్సరాలుగా వెట్ చేస్తున్న. సందర్భం రానే వచ్చిందని ఎంతో ఆనందంగా మా స్నేహితులందరూ కలిసి ఆనందంగా ఎంతో ఉత్సాహంగా అందరు కష్టపడి ఎక్కడెక్కడ ఉన్న వాళ్లంతా కలిసి ఈ కార్యక్రమాన్ని చేయాలని అందరూ కోరుకుంటూ అందరు కలుస్తున్నామని ఆనందంతో కలిసేందుకు వారితో కొంత సమయం గడిపేందుకు ఇదొక మంచి అవకాశం కావున ప్రతి ఒకరి కార్యక్రమానికి తప్పక వచ్చి సంతోషంగా గడపాలని కోరుకుంటూ మీ ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి

## డల్లాస్ గూగుల్ ఆఫీస్ ను సందర్శించిన - ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస ,ప్రజా జ్యోతి న్యూస్ :**



అమెరికా పర్యటనలో భాగంగా ఆమదాలవలస శాసనసభ్యులు ,రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన రవి కుమార్ డల్లాస్ లో ఉన్నటువంటి గూగుల్ ఆఫీస్ ను సందర్శించారు. ప్రస్తుత కాలంలో సాఫ్ట్వేర్ రంగంలో అత్యంత క్రియాశీలంగా , వేగంగా దూసుకుపోతున్నటువంటి ఎ.ఐ టెక్నాలజీ విశిష్టత కోసం గూగుల్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ తో విశ్లేషించారు. ఎ.ఐ టెక్నాలజీని ఉపయోగించుకుని రాష్ట్రాన్ని విద్యా,వైద్య,సాఫ్ట్ వేర్ అన్ని రంగాల్లో ప్రణాళిక బద్దంగా అభివృద్ధి చేసుకోవాలని దీనికి సంబంధించి ఇంజనీరింగ్, ఐ . టి, ఎ.ఐ రంగాలు కోసం గూగుల్ కంపెనీకి చెందిన పలువురు నిపుణులతో మాట్లాడారు.ఈ సందర్భంగా సాఫ్ట్వేర్ రంగ ప్రాముఖ్యత,సాధిస్తున్న అభివృద్ధిని కొనియాడారు. తెలుగువారు సాఫ్ట్వేర్ రంగంలో అత్యంత కీలకమైన పదవుల్లో ఉండటం పై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎన్.ఆర్. ఐ లను కలుసుకొని గత సైకో వైసీపీ ప్రభుత్వం సాఫ్ట్వేర్ రంగాన్ని ఆంధ్రప్రదేశ్లో నాశనం చేసిందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధినేత నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ని అన్ని రకాలుగా సాఫ్ట్వేర్ కంపెనీలకి అనుకూలమైన వాతావరణ కల్పించారని, పలు రాయితీలు ఇస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలోని వైజాగ్ ప్రాంతం సాఫ్ట్వేర్ రంగానికి ఎంతో అనుకూలమైన ప్రాంతంగా ఉందని విశాఖపట్నం సిటీలో ప్రస్తుతం కొన్ని సాఫ్ట్వేర్ కంపెనీలు ఉన్నాయంటే అది సీఎం చంద్రబాబు నాయుడు ,నారా లోకేష్ కృషి వల్లనే అని తెలిపారు.భవిష్యత్తులో ఇంకా పూర్తిస్థాయిలో వీలైనంత ఎక్కువ సాఫ్ట్వేర్ కంపెనీలు ప్రారంభించాలని ఆంధ్ర రాష్ట్ర యువతకి ఉపాధి కల్పించాలని ఎన్నారైలకు విజ్ఞప్తి చేశారు.

## ఉగాది ఉత్సవాలు పురస్కరించుకుని భారీ అన్న సమారాధన





**తూర్పుగోదావరిజిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్4, ప్రజాజ్యోతి న్యూస్**

కుమారదేవం లో ప్రముఖ ప్రసిద్ధి దేవాలయమైమాతృశ్రీ గండిపోచమ్మ ఆలయం దగ్గర దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ ఆదికారి సి. హెచ్ .వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఎంతో ఘనంగా ఉగాది సంబరాలు నిర్వహించారు, ఆ సంబరాల్లోభాగంగా ఆఖరి రోజున భారీ అన్నసమారదన జరిపారు, ఈ అన్నసమారాదనకు ముఖ్య అతిధిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కమిటీ కూటమి సభ్యులు చుట్టు ప్రక్కల గ్రామములనుండి సుమారు ఆరు వేల మంది అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలుస్వికరించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు

# రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన అంజలి ఆత్మహత్య కేసు






**13 రోజులు పాటు ముత్యువుతో పోరాడి కార్పొరేట్ వ్యవస్థకు తలవాల్సిన అంజలి .**

**అంజలి అత్యుపై నేటి వరకు కూడా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం**

**రౌతు గూడెంలో అడుగున పోలీసులు పహారా .**

**గీనిఘా సంస్థల ఆధ్వర్యంలో అంజలి దహన సంస్కారాలు .**

**( ప్రజాజ్యోతి న్యూస్)/జీలుగుమిల్లి**

పుష్కర కాలం పాటు నోములు వ్రతాలు పుణ్యాలు చేయగా పుట్టిన బిడ్డ నల్లాపు అంజలి కార్పొరేట్ సంస్థలకు బలయిందని బంధువులు తీవ్రన ఆరోపణలు గుప్పించారు. నెలరోజుల్లోపు ఇంటికి తిరిగి వస్తానన్న అంజలి పార్థు దేహంతో ఇంటికి రావడంతో జీలుగుమిల్లి మండలంలోని ములుగులంపల్లి పంచాయతీలో గల రౌతు గూడెంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఏ ఒక్కరికి సాధ్యం కానీ పరిస్థితి నెలకొంది. ఓ పక్కన పోలీసులు పహారా, ఎవరితోనూ మాట్లాడనివ్వని పరిస్థితి, ప్రభుత్వం కూడా పట్టించుకోని పాపం వెలసి ఆ తల్లిదండ్రులకు కన్నీటి వేద మిగిల్చింది. ఆత్మఅత్యాయనలతో బ్రెయిన్ డెడ్ తో ముచ్చుతో పోరాడి ఈరోజు తెల్లవారుజామున గుండెపోటుతో మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో హుటా హుటిన వందల మంది రాజమండ్రి తరలి వెళ్లారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వద్ద పంచినమ్మ నిర్వహించిన అనంతరం పోలీసుల పహారాలో మృతదేహాన్ని రౌతు గూడెం తీసుకొని వచ్చారు. అప్పటికే కోపోద్రోహులైన జన సమూహం రోడ్లపై బైఠాయించి పోలీసులకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన పోలీసులు ఎక్కడికి అక్కడ బందోబస్తు ఏర్పాటు చేసి దగ్గరుండి దహన సంస్కారాలు నిర్వహించారు. పోలవరం శాసనసభ్యులు బాలరాజు కిమ్స్ హాస్పిటల్ కి వెళ్లి పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఇంత జరిగిన రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆ తల్లిదండ్రులకు ఏ విధమైన హామీ ఇవ్వకపోవడం శోచనీయం అని అంజలి మృతదేహం చూసిన ప్రతి ఒక్కరు ఆ పోతున్నారు. ఈమె బలహీన వర్గానికి చెందిన డాక్టర్ కనుకనే న్యాయం జరగలేదని ప్రతి ఒక్కరు వాపోతున్నారు. డిప్యూటీస్ సీఎం పవన్ కళ్యాణ్ ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఒక న్యూస్ మాత్రం హల్చల్ చేస్తుంది. ఏది ఏమైనా ఆ వృద్ధ దంపతులను ఓదార్చడం ఏ ఒక్కరు తరం కాని పరిస్థితి. ఆ అల్ సెల్ పైనే అందరూ చూపులు ఉన్నాయి. ఆయనైనా ఆదుకుంటాడని నమ్మకంతో ఆ ప్రాంతపు వాసులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలువురు రాజకీయ నాయకులను ఆ ప్రాంతపు వాసులు నిలదీస్తున్నారు. పార్టీలు ప్రమేయం లేకుండా అందరూ కూడా అంజలి కుటుంబం నీకు అండగా ఉన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల లో కూటమి నాయకులు పాఠ్య పుస్తకాలు పంపిణీ .

**బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాము.**



**ప్రజాజ్యోతి న్యూస్ /జీలుగుమిల్లి**

జీలుగుమిల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధ కృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ ప్రభుత్వ జూనియర్ కళాశాల జీలుగుమిల్లిలో గ్రామ తెలుగుదేశం, జనసేన,బిజెపి పార్టీల నాయకుల ద్వారా విద్యార్థులకు నోట్ బుక్స్ మరియు పాఠ్య పుస్తకాల చేశారు. జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తూ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు వీటిని పంచడం గొప్ప శుభపరిణామం అని తెలిపారు. బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాము పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందిస్తూ సక్రమ రీతిలో ప్రభుత్వం అందించిన ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిడిపి సీనియర్ నాయకులు గద్దె సుబ్రహ్మణ్యం నోట్ బుక్స్ ను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం ఇస్తున్న ఈ పాఠ్యపుస్తకాలను చదివి మంచి మార్కులతో కృతార్థులు కావాలని అన్నారు. సీనియర్ బిజెపి నాయకులు కొండపల్లి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో రాష్ట్రం అధోగతి





**హామీలను అమలు చేయలేక కొత్త డ్రామాలు**

**సూపర్ సిక్స్ నుండి దృష్టి మళ్లించేందుకే పీ4 పథకం**

**వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్**

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :**

పది నెలల కూటమి పాలనలో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి , అందించిన సంక్షేమం శూన్యమని,రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతుందని వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు , నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాత్రం కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల నుండి దృష్టి మళ్లించేందుకే కొత్తగా పీ 4 పథకం తో ప్రజలను మరోసారి మబ్బిపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలనే ఆలోచన ఉంటే హామీలు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని , కొత్త డ్రామాలతో కాలయాపన చేయవద్దని విమర్శించారు. పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విప్లవాత్మక మైన మార్పులకు శ్రీకారం చుట్టి అనేక సంక్షేమ పథకాలను గత ఐదేళ్ల పాలనలో అమలు చేశారన్నారు. కానీ నేడు బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైసిపి హయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపి వేయడమే కాకుండా బురద జల్లె ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఉగాది పండుగ వస్తే జగన్మోహన్ రెడ్డి ఏదో ఒక నూతన పథకంతో డిబీటీ ద్వారా లబ్దిదారులకు సంక్షేమాన్ని అందజేశారన్నారు.కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా తమ వైఫల్యాలని కప్పు పుచ్చుకునేందుకు ఒక్క రూపాయ ఖర్చు లేకుండా పీ 4 కు తెరలేపారన్నారు.కూటమి పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ప్రతీ ఏటా రైతులకు అందజేస్తామన్న 20,000 ఆర్థిక సాయం,యువతకు ఇస్తామన్న ఉపాధి అవకాశాలు ,నిరుద్యోగ భృతి , ప్రతీ మహిళకు రూ.1500 , విద్యార్థులకు ఏడాదికి రూ.15000 , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఈ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. అబద్దాలతో , డ్రామాలతో ఎక్కువకాలం రాష్ట్రంలోపాలన సాగించలేరని ఎద్దేవా చేశారు. ఏది ఏమైనప్పటికీ పార్టీ అధికారంలోకి వచ్చిన అతి కొద్ది వ్యవధిలోనే ప్రజల్లో కూటమి పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ప్రతీ ఒక్క వైఎస్సార్సీపీ కార్యకర్త సమన్వయంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ వైసిపి అండగా ఉంటుందని , వైసిపి పార్టీ లో చిన్న ,పెద్దా అనే తేడా ఉండదు అని పార్టీ కోసం పనిచేసే ప్రతీ ఒక్కరూ సమానమే అని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ లోలుగు కాంతారావు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దె ఎక్కిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేసినట్లే వాలంటీర్లని మోసం చేశారన్నారు. గత ఏడాది ఉగాది నాడు అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ. 10 వేలు జీతం పెంచుతామని ఇప్పుడు ఆ ఊసేలేదన్నారు.ప్రజలకు ,ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేసిన వాలంటీర్లను రాజకీయ దురుద్దేశం తో విస్మరించడం సరైనది కాదన్నారు. సంపద సృష్టిస్తానని ఎన్నికల్లో చెప్పి అధికారం చేపట్టాకా సంపద సృష్టి పేరుతో సూపర్ సిక్స్ పథకాలను విస్మరించడం సమంజసం కాదన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించలేక విద్యార్థులను ఇబ్బందికి గురి చేస్తున్నా రాన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బూర్జ మండల పార్టీ అధ్యక్షులు కండాపు గోవింద రావు , సరిబుజ్జిలి జెడ్పీటీసీ సరవరపు నాగేశ్వర రావు , సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వర రావు , బొడ్డేపల్లి పద్మజ , ఆమదాలవలస మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి అజంత కుమారి , మున్సిపల్ కౌన్సిలర్ దుంపల శ్యామల రావు , ,వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ , మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి , పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు ,జిల్లా ఉద్యోగుల ,పెన్షనర్ల విభాగం అధ్యక్షులు పప్పల రాధాకృష్ణ , గుడ్ల మోహన్ , ఉప ఎంపీపీ ప్రతినిధి వండాన వెంకట రావు , సూరపు నాయుడు , వడగా పద్మ , రమణమ్మ , మండల వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: టిడిపి యువనేత రితేష్ రెడ్డి

**బద్వేల్ ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి న్యూస్)**



గురువారం బద్వేల్ నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాల కారణంగా పలు చోట్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీంతో రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కొన్నారని తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి గారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రితేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఉండాలని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోరే ప్రభుత్వమని రైతుల కోసం ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందించి వారిని ఆదుకుంటామని తెలిపారు. ఇప్పటికే నష్టంపై అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను సైతం ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు అచ్చం నాయుడు గారితో మాట్లాడడం జరిగిందని మంత్రిగారు కూడా సానుకూలంగా స్పందించారని త్వరలోనే రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు.

## పగడాల ప్రవీణ్ మృతిపై స్పందించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు..



**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

కూటమి ప్రభుత్వం పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పై సమగ్ర విచారణ జరుపుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనార్థం హైదరాబాదు నుండి ఇండిగో విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడరు. పగడాల ప్రవీణ్ కుటుంబ సభ్యులు కూటమి ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని విచారణ జరుగుతుందని ఎవరు కూడా దీనిని రాజకీయం చేయొద్దని తెలిపారు . సిసి ఫుటేజ్ ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. త్వరలో ఆయన మృతిపై మిస్టరీ వీడుతోందని తెలిపారు. వక్స్ బిల్లు సవరణ ప్రతి పేద ముస్లింకు లాభం చేకూరే విధంగా నరేంద్ర మోడీ, అమిత్ షా నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై పేద ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

# తెలంగాణలో బర్డ్ ఫ్లూ కలకలం

**హైదరాబాద్ :** బర్డ్ ఫ్లూ మళ్లీ భయపెడుతోంది. బుధవారం హైదరాబాద్ నగర శివార్లలోని ఓ ఫౌల్ట్రీ ఫారమ్ లో బర్డ్ ఫ్లూ వైరస్ నిర్ధారణ కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేగింది. గత నాలుగు రోజుల క్రితం నగర శివారులోని ఓ ఫౌల్ట్రీలో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. అధికారులు చనిపోయిన కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించారు.ల్యాబ్ నుంచి వచ్చిన టెస్టు ఫలితాల్లో బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో పౌల్ట్రీ ఫామ్స్ ను అధికారులు సీజ్ చేశారు. అందులో పనిచేస్తున్న వారందరి శాంపిల్స్ సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ నేపథ్యంలో కోళ్లతోపాటు కోడి గుడ్లను కూడా ఎవరికీ అమ్మొద్దని ఫౌల్ట్రీ యాజమానులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.హైదరాబాద్ నగరంలోని అధిక శాతం చికెన్ దుకాణాలకు కోళ్లు, కోడి గుడ్లు నగర శివార్లలోని, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫౌల్ట్రీ ఫామ్ ల నుంచి సరఫరా అవుతుంటాయి. ప్రస్తుతం నగర శివార్లలోని ఫౌల్ట్రీ ఫామ్ లో బర్డ్ ఫ్లూ కలకలం రేగడంతోపాటు.. పలు ఫామ్ లలోని కోళ్లు బర్డ్ ఫ్లూ కారణంగానే మరణించినట్లు నిర్ధారణ కావడంతో నగరంలోని చికెన్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు ప్రస్తుతం బర్డ్ ఫ్లూగా నిర్దారణ అయిన అబ్దుల్లా పూర్ మెంట్ ఫౌల్ట్రీ ప్రాంతాన్ని అధికారులు రెడ్ జోన్ గా ప్రకటించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా నల్గొండ జిల్లా గుండ్రాంపల్లి, దోతిగూడెంలోని మూడు ఫౌల్ట్రీ ఫామ్స్ లో బర్డ్ ఫ్లూ సోకినట్లు అధికారులు గుర్తించారు. ఆయా ఫామ్స్ లో ఉన్న కోళ్లను అధికారులు జాగ్రత్తగా పూడ్చిపెట్టారు. ఆ ప్రాంతంలో ఐదు కిలో మీటర్ల వరకు రెడ్ జోన్ గా ప్రకటించారు.ఇదిలాఉంటే.. బాగా ఉడికించిన చికెన్, కోడిగుడ్లు తినడం వల్ల వ్యాధి సోకే అవకాశాలు ఏమాత్రం లేవని వైద్య నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. సాధారణంగా ఈ వైరస్ లు మనుషుల్లోకి ప్రవేశించవు. కానీ, కొన్నిసార్లు జలుబు నుంచి తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు కలిగిస్తాయి. ప్రాణాలు కోల్పోవడమూ సంభవమే. కోళ్లు ఇతర ఫౌల్ట్రీ పక్షుల వ్యర్థాలను ముట్టుకోవడం ద్వారా వ్యాధి మనుషులకు వ్యాపించే అవకాశాలు ఎక్కువ. ఒకవేళ ఈ వ్యాధి వస్తే జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందితోపాటు కడుపు నొప్పి, వాంతులు, అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. బర్డ్ ఫ్లూ వైరస్ సోకకుండా ఉండాలంటే.. బాగా ఉండికించిన తరువాత మాత్రమే చికెన్, గుడ్లు వంటివి తినాలి. ఉడికించని పక్షి మాంసాన్ని ఇతర ఆహార పదార్థాలకు దూరంగా ఉంచడం మేలు. ఫౌల్ట్రీ రంగంలో పనిచేసేవారు వ్యక్తిగత శుభ్రత కచ్చితంగా పాటించాలి. కోళ్ల ఫారమ్ లలో పనిచేసేటప్పుడు చేతులకు కచ్చితంగా తొడుగులు వేసుకోవటం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవటం, ఎన్ 95 మాస్కులు ధరించడం, పీపీఈ కిట్లు, కళ్లజోళ్లు వాడటం ద్వారా వైరస్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

## గ్రామ సచివాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

**బూర్జ,ప్రజా జ్యోతి న్యూస్:**



బూర్జ మండలం అన్నంపేట గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నాడు చలివేంద్రంఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసైనికులు మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని సచివాలయ సేవలను వినియోగించుకునేందుకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలు విపరీతంగా ఉండటంతో సచివాలయం వద్దకు వచ్చే వారికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ఈ చలివేంద్ర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పరిడల శ్యాంసుందర్, కరణం రామకృష్ణ, మజ్జి రమణ జనసేన పార్టీ నాయకులు సోమరాజు పవన్, కుప్పిలి చంటి, గుంటుబోయిన తిరుపతి, గుంటుబోయిన రామకృష్ణ, దంత మణికంఠ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ అభినందన సన్మాన సత్కార సభ

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**




ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మను పద్మశ్రీ పురస్కారం వరించడం తెలుగు వారికి గర్వకారణమని, మాతృభాషపై పట్టు ఉంటే ఇతర భాషలు సులభంగా నేర్చుకోగలమని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు భవన సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ అభినందన సన్మాన సత్కార సభను విశ్వవిద్యాలయంలోని పూర్వ విద్యార్థి సంఘం ద్వారా నిర్వహించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి అయిన ద్విసహస్రావధాని, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ భారతదేశ ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి హాజరయ్యారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతు పద్మశ్రీ వరించడం ప్రతిష్టాత్మకమని, అందులోనూ చదువుకున్న విశ్వవిద్యాలయంలోనే సన్మానం అందుకోవడం అదృష్టమని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిను కొనియాడారు. తెలుగు భాష వ్యాప్తికి కృషి చేయాలని అన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మకు భారతదేశ ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం రావడం గర్వకారణమని అన్నారు. విశ్వవిద్యాలయంలోని పూర్వ విద్యార్థి సంఘం తరపున ఈ రోజు సభాభవనంలో సత్కరించడం ఆనందమని హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థులందరూ కూడా చదువుకొని ఇటువంటి ఉన్నత స్థానాన్ని పొందాలని ఈ సందర్భంగా ఆయన ఉద్దేశించడం జరిగినది. అవధాన ప్రక్రియ పైన ప్రతి ఒక్కరు అధ్యయనం చేస్తూ జ్ఞానాన్ని సంపాదించాలని సూచించారు. బ్రహ్మశ్రీ మాడుగుల ఫణి శర్మ మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేయడం ఎంతో భాగ్యంగా భావిస్తున్నానని అన్నారు, తెలుగు భాష ఎంతో గొప్పదని, తెలుగు భాషలో ఉన్న జ్ఞానాన్ని ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అవధాన ప్రక్రియ అవధారణ యొక్క మాహాత్మ్యం ఏదైతే ఉందో దాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు. శ్లోక రచన, స్మృతి మొ. విషయాలను నేర్చుకోవడం విద్యార్థులందరూ చేయాలని సూచించారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు కొంపెల్ల రామ సూర్యనారాయణ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వపు ఉపకులపతి రాళ్లపల్లి రామ్మూర్తి, ద్రవిడ విశ్వవిద్యాలయ పూర్వపు వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, తిరుపతి భారతీయ విద్యా భవన్ సంచాలకులు మరియు కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు, స్విమ్స్ డీన్ డా అల్లాడి మోహన్, విశ్వవిద్యాలయ న్యాయ సలహాకారులు అజయ్ కుమార్, రెడ్ శాండల్ టాక్స్ ఫోర్స్ డిఎస్పీ బాలి రెడ్డి, రొంపిచర్ల యశ్వంత్ దీక్షితులు తదితరులు బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ తో వారికున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, తెలుగుభాషకు, అవధాన రంగానికి నాగఫణి శర్మ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్గా పూర్వ విద్యార్థి సంఘం జనరల్ సెక్రటరీ సాహిత్య సంస్కృతి డీన్ ప్రొ. సత్యనారాయణాచార్య వ్యవహరించారు. అదే విధంగా తెలుగు విభాగం అధ్యాపకులు డా.డి.నల్లన్న వ్యవహరించి కార్యక్రమం చక్కగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం అంతటికీ కూడా సభా సంచాలకులుగా ఎడ్యుకేషన్ విభాగం ప్రొ.సచ్చిదానందమూర్తి వ్యవహరించి, చక్కగా నడిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకురాలు విజయలక్ష్మి పాల్గొనగా, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ స్వాగతోపన్యాసం చేశారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ సన్మాన సత్కార కార్యక్రమంలో అభినందన ప్రశంసాపత్రాన్ని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఐటెప్ విద్యార్థి శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ రచించి, వినిపించారు.

# శ్రీవారి భక్తులకు అందుతున్న సేవలు, భక్తుల సూచనలపై ఈవో సమీక్ష





## గదుల పరిశుభ్రత, కేటాయింపు కోసం సిబ్బందికి ప్రత్యేక యాప్

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

కలియుగ దైవం శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు కల్పిస్తున్న సేవలు, భక్తుల నుండి వస్తున్న సూచనలు , ఫిర్యాదులపై టిటిడి ఈవో జే. శ్యామల రావు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం టిటిడి పరిపాలన భవనంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మం, ఇంఛార్జ్ సీవీఎస్వో వి. హర్షవర్ధన్ రాజులతో కలసి పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాలు సంతృప్తికరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూలైన్లలో భక్తులకు అందుతున్న అన్నప్రసాదాలు, పాలు, తాగునీరు పంపిణీలో భక్తుల నుండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి సమగ్ర విశ్లేషణాత్మక నివేదిక రూపొందించాలన్నారు. లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేసే కౌంటర్ల వద్ద భక్తులకు ఆలస్యం చేయకుండా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తిరుమలకు వచ్చే భక్తులకు అందుబాటులో ఉన్న రవాణా సదుపాయాలపై భక్తుల నుండి అభిప్రాయసేకరణ చేపట్టాలని, తద్వారా వారికి మరింతగా మెరుగైన సేవలు అందించవచ్చని సూచించారు. తిరుమలలో రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉచిత బస్సుల సంఖ్యను పెంచాలని సూచించారు. తిరుమలలోని పలు ప్రాంతాలు, కాటేజీలలో పరిశుభ్రతను పెంచేందుకు సిబ్బందికి ప్రత్యేకంగా ఒక యాప్ ను రూపొందించి, ఈ యాప్ పై అవగాహన కల్పించి తద్వారా వచ్చే ఫిర్యాదుల ద్వారా సమస్యలను పరిష్కరించి పరిసరాలు మరింతగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులు టిటిడి వసతి గదులను ఎన్ని గంటలకు ఖాళీ చేస్తున్నారు, తిరిగి ఎన్ని గంటలకు గదులను భక్తులకు కేటాయిస్తున్నారనే సమగ్ర సమాచారం తెలిసేలా సిబ్బందికి యాప్ రూపొందించి, సదరు యాప్ పై అవగాహన కల్పించి భక్తులకు గదుల కేటాయింపులో ఆలస్యం చేయకుండా కేటాయించాలని ఆదేశించారు. తిరుపతిలో భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసిన తర్వాత తిరుమలకు సకాలంలో లగేజీని చేర్చి భక్తులకు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. శ్రీవారి దర్శనం, వసతి సదుపాయాలు, అన్నప్రసాదాలు, క్యూలైన్లలో సదుపాయాలు, కల్యాణకట్ట, రవాణా, విజిలెన్స్ , పారిశుద్ధ్యం తదితర శాఖలపై ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో టిటిడి సీఈ టి.వి. సత్యనారాయణ తదితర పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కు బ్రహ్మరథం పట్టిన కూటమి ప్రభుత్వ నాయకులు.

**ఎన్టీఆర్ కు నివాళులర్పించి ర్యాలీ ప్రారంభం...**

**తుడా మైదానం వరకు సాగిన భారీ ర్యాలీ...**

**మండుటెండను సైతం లెక్కచేయని అభిమానులు...**

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**





ఆంధ్ర రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు జి నరసింహ యాదవ్ ఎన్నికైన విషయం విధితమే. ఈ క్రమంలో అశేష అభిమానుల మధ్య నరసింహ యాదవ్ శుక్రవారం తిరుపతిలో భారీ ర్యాలీని చేపట్టారు. ర్యాలీలో భాగంగా ముందుగా ప్రకాశం రోడ్డు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించి ర్యాలీని ప్రారంభించారు. బాలాజీ కాలనీ నుండి తుడ మైదానం వరకు సాగిన ర్యాలీలో అడుగడుగునా కూటమి ప్రభుత్వ నాయకులు అభిమానులు నరసింహ యాదవ్ ను గజమాలలతో, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా టిడిపి తిరుపతి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ , చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బాలాజీ కాలనీ వద్ద సత్కరించారు.అలాగే జనసేన నాయకులు కార్పొరేటర్లు నరసింహ, ఎస్కే బాబు ఆధ్వర్యంలో పూల వీధి వద్ద ఘనంగా సత్కరించగా బండ్ల వీధి వద్ద పులిగోరు మురళీకృష్ణ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అభిమానులుమానులు పాల్గొన్న భారీ ర్యాలీలో గంగమ్మ గుడి దగ్గర అన్న రామచంద్ర యాదవ్, అన్నా రామకృష్ణ యాదవ్, అన్న అనిత యాదవ్, శంకర్ యాదవుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. తుడా మైదానం వద్ద ర్యాలీ చేరుకున్న అనంతరం మీడియాతో ఆంధ్ర రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను ఆదుకోవడంలో టిడిపి అధినాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముందంజలో ఉంటారని అన్నారు. నాకు ఈ అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడుకు నారా లోకేష్ కు ఆజన్మాంతం రుణపడి ఉంటానని తెలియజేశారు. నారా చంద్రబాబునాయుడు కల్పించిన ఈ అవకాశంతో బీసీలకు యాదవులకు తగిన విధంగా సేవ చేసుకుంటానని స్పష్టం చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వ నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ నరసింహ యాదవ్ కు టిడిపి అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కల్పించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ డిప్యూటీ స్పీకర్ తో పలు అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించిన నేతలు



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్4, ప్రజాజ్యోతి న్యూస్**

కొవ్వూరు పట్టణం నందు బిజెపి సీనియర్ నాయకులు పరిమి రాధాకృష్ణ నివాసానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ను మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి కె. ఎస్ జవహర్ , మాజీ ఎమ్మెల్యే జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు పలు అంశాలపై చర్చించారు అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో పాల్గొని కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అంతా మేలు జరుగుతుందని మరిన్ని రోజుల్లో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో పరిగెడుతుందని డిప్యూటీ స్పీకర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గాయత్రి వెంకటేశ్వరరావు, బూరుగుపల్లి వీరరాఘవులు కూటమి నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ప్రాధాన్యతా పనులు ప్రగతి పై సమీక్ష



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :**

పొందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మన్మథ రావు ఆధ్వర్యంలో వెలుగు డి. ఆర్.డి. ఏ,సి.సి.లు,వి.ఒ. ఏ.లు , ఉపాధి హామీ పథకం ఫిల్డ్ అసిస్టెంట్స్ లతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీ లో కనీసం 200 కంపోస్ట్ పిట్ లు ,ప్రతీ ఇంటివద్ద వ్యక్తిగత సోక్ పిట్ ,,ప్రతి రైతు పొలం లో ఫారం పాండు నిర్మాణం కు లబ్దిదారులు గుర్తింపు చేసి ప్రగతి పెంచాలని సిబ్బందిని ఆదేశించారు..ఈ పనులకు గానూ జాబు కార్డు కలిగి వున్న చిన్న ,సన్నకారు రైతులు అందరూ అర్హులే నని తెలిపారు. జాబు కార్డు లేని వారికి దరఖాస్తు చేసుకుంటే జాబు కార్డు ఇచ్చి పనులు మంజూరు చేస్తామని తెలియ జేశారు.వ్యక్తిగత సోక్ పిట్ కు రూ..6000,కంపోస్ట్ పిట్ కు టైపు వన్ కు రూ..2351,టైపు 2 కి.రూ..647 ,ఫారం పాండు కు సుమారు 50000 మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సందేహాలు నివృత్తికి మండల కేంద్రం లో గల ఎం.జి.ఎన్.ఆర్.ఈ. జి.ఎస్..కార్యాలయం లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. ఓ పైల శ్రీనివాస రావు , ఏపిఎం లు ఆర్ రామమూర్తి , గురుగుబెల్లి శ్యామల రావు , ఎన్.ఆర్ జి.ఈ.ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీ కోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాలు





**ఏప్రిల్ 4, (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

తిరుపతి శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి.రాత్రి 8.30 గంటలకు ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. గరుడ పటాన్ని అవతనం చేశారు.బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారని ఐతిహ్యం. విషమృత్యు నాశనం, రాజ్యపదవులవంటి సకల శ్రేయస్సులు పొందుతారని విశ్వాసం . ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థినిలపై కంప్యూటర్ ఆపరేటర్ లైంగిక వేధింపులు

**బద్వేల్ ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి న్యూస్)**



శుక్రవారం నాడు స్థానిక పట్టణంలోని ఏవిఆర్ స్కూల్ నందు ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థినిలపై కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థినిలు తల్లిదండ్రులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఏ వి ఆర్ స్కూల్ వద్దకు చేరుకొని విద్యార్థులపై అసభ్యరకంగా ప్రవర్తించిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్యకు దేహశుద్ధి చేశారు. విద్యాబుద్ధులు చెప్పవలసిన టీచర్ చిన్నపిల్లలతో ఈ విధంగాప్రవర్తించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్యను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు.

# పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం..




**ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం..**
**రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.**

**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ సిలిండర్లు అందజేయడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి తిరుపతి పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు వీధి నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీధర్ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి రెండో విడతలో దీపం -2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ ను శ్రీకృష్ణదేవరాయలు వీధికి చెందిన డి. చిన్న ఈశ్వరమ్మకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీడియాతో మాట్లాడుతూ దీపం -2 పథకము ద్వారా మహిళలకు అందజేసే గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్ లో భాగంగా మహిళలకు సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు పంపిణీ చేస్తామని చెప్పిన మాట ప్రకారంగా 2024 లో మొదటి విడతగా తిరుపతి పట్టణం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పంపిణీ చేయడం జరిగిందని, మళ్లీ రెండో విడత కూడా తిరుపతి పట్టణంలో పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి దీపం 2 ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 99 లక్షల మూడు వేల మందికి సంవత్సరానికి మూడు చొప్పున ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని అందుకు సుమారు 28 వందలు కోట్లు ప్రభుత్వం భరిస్తున్నదన్నారు. గ్యాస్ కంపెనీలకు ముందుగానే డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. గ్యాస్ బుక్ చేసుకొని డెలివరీ అయిన 24 గంటల్లో లబ్ధిదారుని ఖాతాకు డబ్బు జమవుతుందన్నారు. కొత్తగా రెండు లక్షల మందికి గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో 3,90,000 మందికి సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు అందజేసే గ్యాస్ బాయ్స్ సిలిండర్లు పంపిణీ చేసేటప్పుడు వారి నుండి ఎలాంటి డబ్బు

# మహిళలు ఒంటరిగా ప్రయాణం చేస్తున్నారా!




**శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఎంచుకోండి**
**మీరు ఎక్కడికి వెళ్ళినా మీకు రక్షణగా పోలీస్ ఉన్నట్లే**

**బాపట్ల జిల్లా ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్**

తక్షణ పోలీస్ సహాయం కోసం మహిళలు "శక్తి యాప్" వినియోగించుకునే విధానం గురించి జిల్లాలోని శక్తి బృందాలు విస్తృత అవగాహన కల్పిస్తున్నాయి. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ ఏస్ఐ చంద్రావతి ఆద్వర్యంలోని శక్తి బృందం శుక్రవారం బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థినిలకు "శక్తి యాప్" గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుమారు 200 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. వారి మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ ఇన్స్టాల్ చేసి,యాప్ లో నిక్షిప్తమైన సమాచారం గురించి వివరించారు. కొందరు విద్యార్థినీలను ఎంపిక చేసి వారితో శక్తి వారియర్ గ్రూప్ లను ఏర్పాటు చేసి గ్రూప్ యొక్క ప్రత్యేకతలను తెలిపారు. "శక్తి యాప్" మహిళల భద్రత కొరకు రూపొందించ బడిందని ఎస్సై చంద్రావతి తెలిపారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శక్తి యాప్ లోని ఎస్ఓఎస్ (%ంశీం%) బటన్ ప్రెస్ లేదా హ్యాండ్ షేక్ ఆప్షన్ ను ఇనేబుల్ చేసుకుంటే ఆపద సమయంలో ఫోన్ ను షేక్ చేస్తే చాలు దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. ఫోన్ లొకేషన్ ఆధారంగా 10 నిమిషాలలో పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని వారికి భద్రత కల్పిస్తారన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్ లోని సేఫ్ ట్రావెల్ అను ఆప్షన్ ఎంచుకొని దానిలో ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతున్నారనే వివరాలు నమోదు చేస్తే వెళుతున్న మార్గాన్ని కంట్రోల్ రూమ్ నుండి ట్రాక్ చెయ్యబడుతుందన్నారు. వెళ్లవలిసిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో వాహనం వెళుతుంటే వెంటనే దగ్గరలోని పోలీసులకు సందేశం వెళుతుందని క్షణాల్లో పోలీసులు బాధితురాలు ఉన్న ప్రదేశానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. అత్యవసర సమయంలో మహిళల రక్షణకు శక్తి యాప్ ఎంతో ఉపయోగకరంగా వుంటుందని మన భద్రత మన చేతుల్లోనే ఉందిని ప్రతీ మహిళా "శక్తి యాప్" ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

# వరంగల్ చిల్లీకి జియో గుర్తింపు



**వరంగల్ :** వరంగల్ చపాటా మిర్చికి జియోగ్రాఫికల్ ఐడెంటిటీ లభించింది. ఈ మేరకు భౌగోళిక గుర్తింపు సంస్థ (జియోగ్రాఫిక్ ఇండికేషన్స్ రిజిస్ట్రీ) సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో తెలంగాణ నుంచి 18వ ఉత్పత్తిగా చపాటా మిర్చి జీఐ ట్యాగ్ పొందినట్లయ్యింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘంతో పాటు మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త కె.భాస్కర్, శ్రీకొండా లక్ష్మన్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ సహకారంతో చపాట మిర్చికి భౌగోళిక గుర్తింపు లభించింది.2022లోనే చెన్నైలోని ఇండియన్ పేటెంట్ సంస్థకు దరఖాస్తు చేశారు. దీంతో దాదాపు మూడేళ్లకు టపాట మిర్చికి ఆ సంస్థ జీఐ ట్యాగ్ సర్టిఫికేట్ జారీ చేయగా.. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.చపాట మిర్చికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉంది. చపాట మిర్చి టమాట ఎరుపు రంగులో ఉండి, తక్కువ కారంతో ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటుంది. ఇందులో ఒలియోరెసిన్ ( మిరప నుంచి తీసే నూనే) కంటెంట్ 6.37 శాతం నుంచి 6.75 శాతం వరకు ఉండి ఘాటు తక్కువగా ఉంటుంది.ఈ ఆయిల్ ను ఇంటర్నేషనల్ ఫుడ్స్ తోపాటు ఖరీదైన స్వీట్లు, కాస్మోటిక్స్, వివిధ రకాల డ్రింక్స్, మెడిసిన్ తయారీలో దీనిని వినియోగిస్తున్నారు. దీంతోనే చైనా, యూకే, యూఎస్, జర్మనీతో పాటు ఇరత యూరోపియన్ కంట్రీల్లో మంచి డిమాండ్ ఉంది.ఈ చపాటా మిర్చి ఇదివరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నడికూడ మండలంలోనే ఎక్కువగా సాగయ్యేది. అక్కడి రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసి ఇతర ప్రాంతాల రైతులకు అందించడంతో ఉమ్మడి వరంగల్ తో పాటు కరీంనగర్ జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటం, బహిరంగ మార్కెట్ లో డిమాండ్ కూడా బాగానే ఉండటంతో రైతులు చాలావరకు చపాటా వైపు మొగ్గు చూపుతున్నారు. కాగా వరంగల్ జిల్లా దుగ్గొండ మండలంలోని తిమ్మంపేట రైతు ఉత్పత్తిదారుల సంఘంతో ఈ చపాటా మిర్చికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కినట్లయ్యింది.వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామంలో దాదాపు 300 మంది రైతులు తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకుని.. గ్రామంలో పండించిన మిర్చికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చారు. ఇప్పుడు జీఐ ట్యాగ్ తో చపాటా మిర్చికి మరింత డిమాండ్ పెరగనుంది. ఫలితంగా రైతులకు కూడా మరింత లబ్ధి చేకూరనుంది.ప్రస్తుతం హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో దాదాపు 20 వేల మంది రైతులు చపాటా మిర్చి 6,738 ఎకరాలకుపైగా సాగు చేస్తుండగా.. తిమ్మంపేట రైతుల కృషితో ఈ చపాటా మిర్చికి మంచి గుర్తింపు దక్కినట్లయ్యింది. దీంతో రైతులు నేరుగా వివిధ రాష్ట్రాలు, దేశాలకు పంట ఉత్పత్తిని ఎగుమతి చేసుకునే అవకాశం కలిగినట్లయ్యింది.బహిరంగ మార్కెట్ లో ప్రస్తుతం చపాటా మిర్చి ధర కిలో రూ.300 వరకు ఉంది. జీఐ ట్యాగ్ వల్ల కిలోకు రూ.450 నుంచి రూ.500 వరకు ధర లభించనుంది. అంతేగాకుండా రైతులు తమ సొంత లోగో, బ్రాండ్ ఏర్పాటు చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేసే అవకాశం కలగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## శ్రీరామనవమి పురస్కరించుకొని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం




**గుంతకల్లు ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి):**

ఈనెల 6వ తేదీన ఆదివారం శ్రీరామనవమి పురస్కరించుకొని కసాపురం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవాలయం నందు ఉదయం 9.30 ని.లకు శ్రీ రాములవా రిని పెళ్ళికొడుకు చేసే కార్యక్రమం సీతమ్మ వారి పెళ్లికూతురుగా ఎదుర్కోలు కార్యక్రమం పెళ్లిళ్ల సంప్రదా యాల్లో భాగంగా మహిళలచే పసుపు కొమ్ములను దంచుట కోలన్నలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందోత్స వాలతో సీతారాముల కళ్యాణ తలంబ్రాలు కార్యక్ర మం స్వామి అమ్మవా రి పల్లకి సేవ భద్రాది రాముని కళ్యాణ మహోత్సవమును తలపించేలా జరుగును, కావున భక్తులు మహిళలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందాలని, మధ్యాహ్నం సాంప్రదాయ వంటకాలతో భోజన వసతి ఏర్పాటు చేయడం జరుగు తుందనిఆలయ కమిటీ ధర్మకర్త తలారి శకుంతలమ్మ పరుశురాముడు దంపతులు తెలియజేశారు.

## జిల్లాలో పలు రోడ్ల అభివృద్ధికి సహకరించాలి..

మంత్రిని కోరిన ఎమ్మెల్యే..



**బాపట్ల, ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)**

జిల్లాలో పలు రోడ్లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని దీనికి ఇదోదికంగా సహకరించాలని రోడ్లు మరియు భవన నిర్మాణ శాఖ మంత్రిబీ.సీ జనార్ధన్ రెడ్డి ని, బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు విజ్ఞప్తి చేశారు. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బాపట్ల నియోజకవర్గం లో పలు రోడ్లు వేడల్పు మరియు అభివృద్ధి పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రికి, ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో పలు రోడ్లు అవసరం ఉందని వాటి వివరాలు మంత్రికి వివరించారు.బాపట్ల నుండి పర్చూరు రోడ్డు అవసరాన్ని మంత్రికి ఎమ్మెల్యే వివరిస్తూ అదేవిధంగా చందోలు నుండి తెనాలి రోడ్డు, కర్లపాలెం నుండి గణపవరం వయా పెద్దపులుగువారి పాలెం రోడ్డు అవసరాన్ని మంత్రికి వివరించారు. అలాగే చందోలు వంతెన నుండి నిజాంపట్నం రోడ్డు,భవనంవారి పాలెం నుండి ఖాజీపాలెం వయా దమ్మన్నవారి పాలెం రోడ్డు అవసరాన్ని మంత్రికి వివరిస్తూ ఈ రహదారులకు నిధులు మంజూరు చేయవలసిందిగా ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ రాజు మంత్రిని కోరారు. ఈ విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారు.

## మోక్షప్రదాత శ్రీరామచంద్రుడే:ఆకెళ్ళ విభీషణశర్మ




**ఏప్రిల్ 4,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి**

వేదవేద్యుడైన శ్రీరామచంద్రడే సమస్త ప్రాణికోటికి మోక్షాన్ని ప్రసాదించగలడని బ్రహ్మశ్రీ ఆకెళ్ళ విభీషణశర్మ ప్రబోధించారు. స్థానిక వివేకానంద సభాప్రాంగణంలో రామకృష్ణసేవాశ్రమం, తిరుపతి మరియు తితిదే హిందూధర్మ ప్రచారపరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణం ప్రవచనామృతంలో అరణ్యకాండ వైభవాన్ని తెలియజేశారు. మహాయోగిపుంగవుడైన శరభంగ మహర్షికి, ధర్మాత్ముడైన జటాయు పక్షికి, మహాభక్తు రాలైన శబరికి మోక్షాన్నిచ్చిన మహనీయుడు శ్రీరామచంద్రుడు. మహర్షుల తపస్సుని భంగపరిచే పద్నాలుగువేల మంది క్రూరరాక్షసులను, కేవలం రెండు గంటలకన్న తక్కువ సమయంలో మట్టికరిపించిన మహవీరుడు. జనస్థానాన్ని క్రూరరాక్షసులకు హతస్థానంగా మార్చి, తపోక్షేత్రంగా చేసిన ధర్మపరాయణుడు శ్రీరామచంద్రుడని డా? ఆకెళ్ళ విభీషణశర్మ కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని శ్రీరామకృష్ణసేవాశ్రమ కార్యదర్శి స్వామిసుకృతానంద మహరాజ్ పూజ, ప్రార్థనలతో ప్రారంభించారు. విశేషంగా భక్తులు, పురప్రముఖులు హాజరై ఈ ప్రవచనాన్ని ఆస్వాదించారు.

## కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ని కలిసిన ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల :** కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఐఏఎస్ ని శు క్రవారం న్యూఢిల్లీ లోని ఆయన కార్యాలయంలో నిజామాబాద్ ఎంపీ. ధర్మపురి అరవింద్ తో కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ అభివృద్ధి పనులపై చర్చించారు. జగిత్యాల పట్టణం జిల్లాగా ఏర్పడ్డ తర్వాత జిల్లా కేంద్రం త్వరతగతిన నలువైపులా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తుందని జగిత్యాల పట్టణానికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అత్యంత ఆవశ్యకంగా ఉందని,మురుగునీటి శుద్ధి ప్లాంటు అవసరం కూడా ఉందని 400 కోట్ల అంచనా తో

# బిజినెస్

## మూడేండ్ల రూ.1300 కోట్ల పెట్టుబడులు




సికె బిర్లా గ్రూప్‌లో భాగమైన నిర్మాణ రంగ మెటీరియల్స్ సొల్యూషన్స్ విభాగం బిర్లానూ లిమిటెడ్ వచ్చే మూడేండ్లలో రూ.1300 కోట్ల పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు వెల్లడించింది. గురువారం హైదరాబాద్‌లో బిర్లానూ సీఈఓ అక్షత్ సేత్ మీడియాతో మాట్లాడుతూ.. అదే సమయంలో కంపెనీ ఆదాయాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంస్థను బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్దేశించుకున్నామన్నారు. పైపులు, నిర్మాణ రంగంలో ఉపయోగించే రసాయనాల వ్యాపార విభాగాలు కీలక వృద్ధిని సాధించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అంతర్జాతీయ ఇంటీరియర్స్ బ్రాండ్ పారాడోర్ వ్యాపారం కూడా వచ్చే మూడు, నాలుగేళ్లలో రెట్టింపు కాగలదన్నారు. అర్జెంటినా, జర్మనీ సహా భారత్‌లో మొత్తంగా 32 తయారీ యూనిట్లను కలిగి ఉన్నామన్నారు. ఆ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ విజరు లహోటి మాట్లాడుతూ.. తమ కంపెనీ 1946లో హెచ్ఐఎల్ లిమిటెడ్ పేరుతో తొలి తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పిన విషయాన్ని గుర్తు చేశారు. హెచ్ఐఎల్ లిమిటెడ్‌ను ఇటీవలే బిర్లానూ లిమిటెడ్‌గా మార్చామని వెల్లడించారు. తమ వ్యాపారంలో తెలుగు రాష్ట్రాలు కీలక వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఇక్కడ ఏఏసీ బ్లాక్స్, పానెల్స్, బోర్డ్సు అమ్మకాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. పైపుల రంగంలో ప్రతీ ఏడాది 70 శాతం వృద్ధిని సాధిస్తున్నామన్నారు.

## ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్
## నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు!





భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించిన వేళ. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే గురువారం నష్టాలను చవిచూస్తున్నాయి. ఈ రోజు ఉదయం 9 గంటల 36 నిముషాలకు నిఫ్టీ 54 పాయింట్లు తగ్గి 23,277కు చేరింది. సెన్సెక్స్ 253 పాయింట్లు దిగజారి 76,356 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 103.05 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 73.26 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.06 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.67 శాతం లాభపడింది. నాస్‌డాక్ 0.87 శాతం ఎగబాకింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల బాంబు పేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచారు. భారతదేశ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34 శాతం, యూరోపియన్ యూనియన్ (ఈయూ) పై 20 శాతం, స్విట్జర్లాండ్‌పై 31, తైవాన్‌పై 32, జపాన్‌పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని 'విముక్తి దినం'గా ట్రంప్ ప్రకటించారు. ఇదిలాఉండగా, మార్చిలో పుంజుకున్న తయారీ రంగ గణాంకాలు సానుకూల సెంటిమెంటుకు దోహదపడినట్లు నిపుణులు తెలియజేస్తున్నారు.

# లాస్టిక్ ప్రాసెసింగ్ పరిశ్రమను
# ప్రారంభించిన మోటాన్




ప్లాస్టిక్ ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం వినూత్న పరిష్కారాలను అందించటంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన మోటాన్ గ్రూప్, భారతదేశంలోని చెన్నైలో తమ అత్యాధునిక సౌకర్యం ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. ఈ వ్యూహాత్మక విస్తరణ భారతీయ ప్లాస్టిక్ రంగం యొక్క పెరుగుతున్న డిమాండ్లను తీర్చడంలో మోటాన్ యొక్క అంకితభావాన్ని నొక్కి చెబుతుంది. నూతనంగా ప్రారంభించిన ఈ సౌకర్యం 2 మిలియన్ యూరోలు (సుమారు రూ.17 కోట్లు) పెట్టుబడిని సూచిస్తుంది, ఇది భారత మార్కెట్ సామర్థ్యంపై మోటాన్ యొక్క విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న 20,000 చదరపు అడుగుల నిర్మాణం పరిశోధన, అభివృద్ధి , పంపిణీకి కేంద్రంగా పనిచేయనుంది. ఈ కార్యక్రమం, భారతీయ కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా అధిక-నాణ్యత కలిగిన ఉత్పత్తులు , సేవలను అందించే మోటాన్ సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. మోటాన్ గ్రూప్ యొక్క చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఫుల్వాక్ సాంద్రా, కంపెనీ యొక్క ప్రపంచ లక్ష్యం నొక్కి చెబుతూ : "1947లో కాన్స్టాన్స్ సరస్సు ఒడ్డున స్థాపించబడిన మోటాన్, ప్లాస్టిక్ పరిశ్రమలో ప్రాసెస్ పెరిఫెరల్స్ కోసం ప్రముఖ భాగస్వామిగా అభివృద్ధి చెందింది, ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాలలో కార్యకలాపాలను నిర్వహిస్తుంది " అని అన్నారు. మోటాన్ గ్రూప్ యొక్క చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్ల్ లిథర్లాండ్, భారత మార్కెట్ యొక్క ప్రాముఖ్యతను వెల్లడిస్తూ "భారతదేశం మాకు అతి పెద్ద మార్కెట్‌గా నిలువనుంది మరియు మేము చాలా కాలంగా భారతీయ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాము. ఈ సౌకర్యం ప్రారంభం ఇక్కడ మా కార్యకలాపాలను విస్తరించటంలో కీలకమైన క్షణాన్ని సూచిస్తుంది" అని అన్నారు. మోటాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆనందకుమార్ రామచంద్రన్ విస్తరణ గురించి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ : "ఈ సౌకర్యం మా వృద్ధి పథంలో ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది . భారత మార్కెట్ పట్ల మా అచంచలమైన నిబద్ధతను ప్రదర్శిస్తుంది" అని అన్నారు.

# రతన్ టాటా వీలునామాలో సంచలన విషయాలు



రతన్ టాటా 9 అక్టోబర్ 2024న 86 సంవత్సరాల వయసులో మరణించారు. తన వీలునామాలో రూ. 10,000 కోట్ల విలువైన తన ఆస్తిలో ఎక్కువ భాగాన్ని పేదలు, పేదలకు సహాయం చేయడానికి ఒక చీ+ూ కి విరాళంగా ఇచ్చారు. కానీ దీనితో పాటు, అతను తన సేవకులు, ఉద్యోగులు, పెంపుడు కుక్క టిటో సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశాడు. రతన్ టాటా తన చిరకాల వంటవాడు రాజన్ షాకు రూ.1 కోటి బహుమతిగా ఇచ్చారు. అలాగే, రూ.51 లక్షల రుణాన్ని కూడా మాఫీ చేశారు. రాజన్ షాకు తన జర్మన్ షెపర్డ్ కుక్క టిటోను జీవితాంతం చూసుకునే బాధ్యతను అప్పగించాడు రతన్ టాటా. దీనికోసం రూ.12 లక్షలు విడిగా ఇచ్చారు. దీనిలో అతను ప్రతి త్రైమాసికంలో రూ.30,000 పొందుతాడు. రతన్ టాటా తన దయగల స్వభావానికి ప్రసిద్ధి చెందారు. అతను తన డ్రైవర్ రాజు లియోన్ కు రూ.1.5 లక్షలు, రూ.18 లక్షల రుణాలను మాఫీ చేశాడు. తన ఇంట్లో పనిచేసే కార్ క్లీనర్లు, ప్యూన్లు వంటి సేవకులకు రూ.15 లక్షలు పంపిణీ చేయాలని కూడా రతన్ టాటా తన వీలునామాతో పేర్కొన్నారు. ఇది అతని సర్వీస్ సంవత్సరాల ప్రకారం అందించబడుతుంది. రతన్ టాటా బ్రాండ్ దుస్తులైన డాక్స్, పోలో, బ్రూక్స్ బ్రదర్స్, బ్రియోని సూట్లు, హెర్మ్స్ టైలను పేదలకు పంపిణీ చేయడానికి చీ+ూ లకు ఇవ్వనున్నారు. ఆయన సన్నిహితుడు శంతను నాయుడు ఎంబీఏలో కోటి రూపాయల రుణం మాఫీ అయింది. పొరుగువాడు జేక్ మలైట్ రూ.23.7 లక్షల రుణాన్ని కూడా మాఫీ చేశారు. ఈ వీలునామాను అమలు చేసినందుకు టాటా ట్రస్ట్ ట్రస్టీ డారియస్ ఖంబట్టా, ఇతరులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల బహుమతి లభిస్తుంది. అతని సవతి సోదరీమణులు షిరిన్, దయానాలకు అతని ఆస్తిలో మూడింట ఒక వంతు లభిస్తుంది. టాటా మోటార్స్ 2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 9,33,166 వాహనాలను విక్రయించింది. ఇది ఖీ24లో ఉన్న 9,69,340 కంటే 4 శాతం తక్కువ. ఇందులో దేశంలో 9,12,155 వాహనాలు అమ్ముడయ్యాయి (4% తక్కువ). అలాగే విదేశాలలో 21,011 వాహనాలు అమ్ముడయ్యాయి (3% ఎక్కువ). ప్రయాణీకుల వాహనాల అమ్మకాలు 5,56,263 (3%) తగ్గుదల, వాణిజ్య వాహనాల అమ్మకాలు 3,76,903 (5%) తగ్గుదల ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

# అప్పట్లో పంజాబ్.. ఇప్పుడు సన్‌రైజర్స్
## సెహ్వాగ్ ఘాటు విమర్శలు

# స్పోర్ట్స్




సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ తీరుపై టీమిండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. పేరుకే జట్టులో 'విధ్వంసకర బ్యాటర్లు' ఉన్నారని.. కానీ వారి వల్ల ప్రేక్షకులకు ఎలాంటి వినోదం లభించడం లేదని పేర్కొన్నాడు. బౌలర్లకు అంతగా సహకరించని ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై కూడా పరుగులు చేయలేక.. చేతులెత్తేయడం వారి పేలవ ప్రదర్శనకు నిదర్శనమని పేర్కొన్నాడు. ఐపీఎల్-2024లో అద్భుత బ్యాటింగ్‌తో ఫైనల్ వరకు చేరుకున్న సన్‌రైజర్స్.. టైటిల్ పోరులో మాత్రం 113 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బౌలింగ్‌లోనూ విఫలమై.. తద్వారా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక ఐపీఎల్-2025 (%ూ% 2025)ని ఘనంగా ఆరంభించినప్పటికీ హ్యాట్రిక్ పరాజయాలతో చతికిల పడింది.

### ఒక్కరూ నిలబడలేదు

తాజాగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో గురువారం నాటి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు మూకుమ్మడిగా విఫలమయ్యారు. లక్ష్య ఛేదనలో ఫోర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఓపెనర్ ట్రవిస్ హెడ్ మరుసటి బంతికే అవుట్ కాగా.. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 2, వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ 2 పరుగులకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (19) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేసి విఫలం కాగా.. భాగస్వామ్యం నెలకొల్పుతారనుకున్న కమిందు మెండిస్ (27), హెన్రిచ్ క్లాసెన్ (33) కూడా నిరాశపరిచారు. మెరుపు బ్యాటింగ్‌తో అలరిస్తున్నాడనుకున్న అనికేత్ వర్మ (6) కూడా ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. ఫలితంగా 16.4 ఓవర్లలో కేవలం 120 పరుగులకే సన్‌రైజర్స్ ఆలౌట్ అయింది.

### 80 పరుగుల తేడాతో ఓటమి

అంతకు ముందు ఇదే పిచ్‌పై చక్కటి షాట్లు ఆడుతూ కేకేఆర్ బ్యాటర్లు 200 పరుగులు స్కోరు చేశారు. అయితే, ఈ టార్గెట్‌ను ఎస్ఆర్‌హెచ్ సులువుగానే ఛేజ్ చేస్తుందనుకుంటే.. 120 పరుగులకే కుప్పకూలి.. 80 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. రైజర్స్ బ్యాటర్లలో మెజారిటీ మంది సులువైన క్యాచ్‌లు ఇచ్చి పెవిలియన్ చేరడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేకేఆర్- సన్‌రైజర్స్ ఫలితంపై స్పందించిన వీరేంద్ర సెహ్వాగ్ హైదరాబాద్ జట్టు తీరుపై ఘాటు విమర్శలు చేశాడు. "ఒకప్పుడు పంజాబ్ జట్టుకు ఇలాంటి పేరుండేది. ముందు నుంచి రాణించడం ఆఖర్లో చేతులెత్తేయడం.. ఇప్పుడు సన్‌రైజర్స్ పరిస్థితి అలాగే కనిపిస్తోంది.

## చరిత్ర సృష్టించిన సునీల్ నరైన్..




ఐపీఎల్-2025లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తిరిగి విన్నింగ్ ట్రాక్‌లోకి వచ్చింది. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 80 పరుగుల తేడాతో కేకేఆర్ ఘన విజయం సాధించింది. 201 పరుగుల భారీ లక్ష్య ఛేధనలో కేకేఆర్ చతకలపడింది. కేకేఆర్ బౌలర్ల దాటికి సన్‌రైజర్స్ 16.4 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌట్ అయింది. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్ (21 బంతుల్లో 33) టాప్ స్కోరర్‌గా నిలవగా.. కమిందు మెండిస్ (20 బంతుల్లో 27), నితీశ్ కుమార్ రెడ్డి (19) కాసేపు క్రీజులో నిలదొక్కుకున్నారు. కేకేఆర్ బౌలర్లలో పేసర్ వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి తలా మూడు వికెట్లు పడగొట్టి ఎస్ఆర్‌హెచ్ పతనాన్ని శాసించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 200 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో కేకేఆర్ స్టార్ ఆల్‌రౌండర్ సునీల్ నరైన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. కేకేఆర్ తరపున తన 200వ వికెట్‌ను నరైన్ అందుకున్నాడు. తద్వారా టీ20 క్రికెట్‌లో ఒకే జట్టు తరపున అత్యధిక వికెట్లు సాధించిన రెండో ప్లేయర్‌గా నరైన్ నిలిచాడు. సునీల్ నరైన్ ఐపీఎల్ ఆరంభం నుంచి కోల్‌కతా నైట్ రైడర్స్‌కే ఆడుతున్నారు. సునీల్ కేకేఆర్ తరుపన ఇప్పటివరకు ఐపీఎల్‌లో 182 , ఛాంపియన్స్ లీగ్ టీ20 లో 18 వికెట్లు తీశాడు. మొత్తంగా 200 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ అరుదైన ఫీట్ సాధించిన జాబితాలో ఇంగ్లండ్ క్రికెట్ క్లబ్ నాటింగ్‌హామ్‌షైర్ బౌలర్ సమిత్ పటేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు నాటింగ్‌హామ్‌షైర్ తరపున పటేల్ 208 వికెట్లు పడగొట్టాడు. పటేల్, నరైన్ తర్వాతి స్థానంలో హాంప్‌షైర్ బౌలర్ క్రిస్ వుడ్ 199 ఉన్నాడు. ముంబై ఇండియన్స్ మాజీ బౌలర్ లసిత్ మలింగ 195 వికెట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు.

## ఇంగ్లండ్ వన్డే సారథిగా స్టోక్స్..
## బ్రూక్‌కు టీ20 పగ్గాలు..?




ఇంగ్లండ్ వైట్ బాల్ కెప్టెన్ ఎంపికపై సందిగ్ధత కొనసాగుతోంది. నిరుడు టీ20 వరల్డ్ కప్‌లో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ జోస్ బట్లర్ రాజీనామా చేయడంతో ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు పలువురు ఆటగాళ్లతో మంతనాలు జరుపుతోంది. అయితే.. సీనియర్ ఆటగాడు జో రూట్ సైతం ససేమిరా అనడంతో.. కుర్రాళ్ల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టు, 20 సంచలనం హ్యారీ బ్రూక్ ఓపెనర్ బెన్ డకెట్‌ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. తాజాగా ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు పగ్గాలు అప్పగిస్తారనే కథనాలు ప్రచారం అవుతున్నాయి. జూన్‌లో భారత జట్టుతో సొంతగడ్డపై ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది ఇంగ్లండ్. ఒకవేళ స్టోక్స్‌ను వన్డే కెప్టెన్‌గా ఎంపిక చేస్తే .. అది ఇంగ్లండ్ బోర్డు స్వార్థపూరితమైన చర్య అని మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ మండిపడితున్నాడు. స్టోక్స్‌ను పూర్తిగా టెస్టులపై గురి పెట్టేలా చూడడమే మంచిదని వాన్ అభిప్రాయపడుతున్నాడు. ఫిట్‌నెస్ సమస్యగా మారనుంది. పైగా ఈమధ్యే మోకాలి సర్జరీ నుంచి కోలుకున్న స్టోక్స్‌పై కెప్టెన్సీ భారం మోపవద్దని కొందరి వాదన. కాబట్టి.. యువకుడైన బ్రూక్‌ను వన్డే, టీ20లకు సారథిగా ఎంపిక చేయాలని పలువురు బోర్డుకు సూచిస్తున్నారు.

ఫైనల్లో 84 నాటౌట్

స్వదేశంలో జరిగిన 2019 వన్డే వరల్డ్ కప్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు స్టోక్స్. న్యూజిలాండ్‌తో ఆడిన ఫైనల్లో 84 నాటౌట్‌గా నిలిచి మ్యాచ్‌ను సూపర్ ఓవర్‌కు తీసుకెళ్లాడు. స్కోర్లు సమం కావడంతో బౌండరీలు ఎక్కువ బాదిన ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు అధికారుడు. యావత్ దేశం కలను సాకారం చేసిన స్టోక్స్.. టెస్టులపై ఇష్టంతో 2022లో వన్డేల నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. అయితే.. జోస్ బట్లర్ విజ్ఞప్తి మేరకు 2023 ప్రపంచ కప్‌లో ఆడిన అతడు.. టోర్నీ ముగిశాక మోకాలి సర్జరీతో చేయించుకున్నాడు. ప్రస్తుతం ఫిట్‌నెస్ సాధించిన అతడు టెస్టులపైనే దృష్టి పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో మళ్లీ వన్డే సారథిగా ఉండేందుకు స్టోక్స్ అంగీకరిస్తాడా? తన వల్ల కాదంటూ చేతులెత్తేస్తాడా? అనేది తెలియాల్సి ఉంది.

# మోక్షజ్ఞ తొలి సినిమా కోసం రంగంలోకి మరో డైరెక్టర్ ఇప్పటికైన మోక్షం వచ్చినట్టేనా?




నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం నందమూరి అభిమానులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురు చూస్తున్నారు. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో మోక్షజ్ఞ సినిమాను అనౌన్స్ చేసిన ఈ సినిమా షూటింగ్ పలు కారణాల వలన ఆగిపోయిందని తెలుస్తుంది. కారణాలు అయితే ఇప్పటి వరకు బయటకు రాలేదు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తల ప్రకారం ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్ నుంచి ఔట్ అయ్యాడని, అందుకే సినిమా ఆగిపోయిందని టాక్ గట్టిగా వినిపించింది. కాని ఇంత వరకూ అఫీషియల్ గా మాత్రం ఏ విషయం బయటకు రాలేదు. మోక్షజ్ఞ కోసం డైరెక్టర్ వెంకీ అట్లూరి ఓ మంచి కథను రెడీ చేశారని తెలుస్తోంది. ఈ కథ బాలయ్య కూడా విన్నారని ..దాంతో వెంకీతో మోక్షజ్ఞ సినిమా ఫిక్స్ అయినట్టు సమాచారం. మరోవైపు బాలయ్య సూపర్ హిట్ మూవీ ఆదిత్య 369 సీక్వెల్ తో మోక్షజ్ఞ.. హీరోగా ఎంట్రీ ఇస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా ఆ విషయంపై ఆదిత్య 369 డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు స్పందించారు. తమ మూవీ సీక్వెల్ కోసం అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. అందుకే స్క్రిప్ట్ కూడా సిద్ధం చేశాం. ఆదిత్య 369 సీక్వెల్ తో బాలయ్య.. మోక్షును ఇండస్ట్రీకి పరిచయం చేయాలని అనుకుంటున్నారు. ఎప్పటికైనా సీక్వెల్ చేయాలని మాత్రం బాలయ్య మనసులో ఉంది. అంటే సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఆదిత్య 369 సీక్వెల్ ఉంటుందని అర్థమవుతుంది. అయితే వెంకీ అట్లూరి మోక్షజ్ఞ కోసం ప్రత్యేకంగా ఒక స్టోరీ సిద్ధం చేసినట్లు సమాచారం. బాలకృష్ణ కూడా ఈ సినిమా స్టోరీ వినాలనుకుంటున్నారని, కథ నచ్చితే వెంటనే సినిమా షూటింగ్ పనులు ప్రారంభం అవుతాయని తెలుస్తుంది. ఈ సినిమాలో మోక్షజ్ఞ లవర్ బాయ్ పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. ఇలా మోక్షజ్ఞ సినిమాకు సంబంధించి తరచూ ఏదో ఒక వార్త వస్తున్నప్పటికీ ఆయన ఏ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తారనేది సస్పెన్స్‌గా మారింది.





## ఓటీటీలో తమిళ హిట్ సినిమా.. తెలుగులో స్ట్రీమింగ్

కోలీవుడ్‌లో తెరకెక్కిన 'పెరుసు' సినిమా ఎవరూ ఊహించని విధంగా విజయం సాధించింది. ఇప్పుడు ఈచిత్రం ఓటీటీలో విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు.  ఇందులో నటుడు వైభవ్‌తో పాటు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక  కీలక పాత్రలలో మెప్పించారు. ఆపై సునీల్ రెడ్డి, బాల శరవణన్, రెడిన్ కింగ్స్‌లీ, చాందిని తమిళరసన్ నటించారు. 'టాంటిగో' (శ్రీలంక చిత్రం) ఆధారంగా 'పెరుసు' మూవీని దర్శకుడు ఇళంగో రామ్ తెరకెక్కించారు. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్, బవేజా స్టూడియోస్, ఎంబర్ లైట్ స్టూడియో సంయుక్తంగా నిర్మించాయి. మార్చి 14న కోలీవుడ్‌లో మాత్రమే విడుదలైన పెరుసు చిత్రం మంచి విజయాన్ని దక్కించుకోవడమే కాకుండా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. కథ తెగనచ్చేసిందంటూ నెటిజన్లు పోస్ట్‌లు పెట్టారు. థియేటర్ రన్ పూర్తి చేసుకున్న పెరుసు ఏప్రిల్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు రానుంది. తమిళ్, తెలుగు, కన్నడ,మలయాళంలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## జి.డి. నాయుడు బయోపిక్‌లో శివానీ రాజశేఖర్

ఆర్. మాధవన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'జి.డి.ఎన్' అనే టైటిల్‌ను ఇప్పటికే  ఖరారు చేశారు. భారత ప్రముఖ ఇంజనీరు జి.డి. నాయుడు జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో రాజశేఖర్, జీవితల కుమార్తె కూడా నటిస్తున్నారు. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా, మిరాకిల్ మేన్, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూరు' వంటి పేర్లను గడించిన గోపాల స్వామి దొరైస్వామి నాయుడు షార్ట్‌గా జి. డి. నాయుడు అని కూడా అంటారు. ఇప్పుడు ఆయన  జీవితం ఆధారంగా 'జి.డి.ఎన్' మూవీ తెరకెక్కుతోంది. ఈ బయోపిక్‌కు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.  ఈ సినిమా టైటిల్ లోగోను మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేశారు. ప్రియమణి, జయరాం, యోగిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. జీడీ నాయుడు బయోపిక్‌లో టాలీవుడ్ హీరోయిన్ శివానీ రాజశేఖర్ కూడా నటించనుంది. ఇందులో మాధవన్‌తో పాటుగా బిగ్ స్క్రీన్‌పై ఆమె కనిపించనున్నారు. త్వరలో ఈ మూవీ సెట్స్ మీదకు వెళ్తుండటంతో ఏర్పాట్లు స్పీడ్‌గా చేస్తున్నారు. కోయంబత్తూరుకు చెందిన జి.డి నాయుడు కేవలం మూడో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కానీ,  ఆటోమొబైల్, అగ్రికల్చర్, టెక్స్‌టైల్, ఫొటోగ్రఫీ వంటి సెక్టార్స్‌లో కొన్ని పరికరాల ఆవిష్కరణలు చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ఫీల్డ్‌లో విప్లవం సృష్టించారని చెప్పవచ్చు. భారతదేశంలో మొట్టమొదటి  ఎలక్ట్రిక్ మోటార్‌ను రూపొందించింది ఆయనే కావడం విశేషం. అందుకే ఆయన్ను ఎడిసన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారు. 1893లో జన్మించిన ఆయన 1974లో మరణించారు.  ఈ మధ్యకాలంలో మాధవన్ నటిస్తున్న రెండో బయోపిక్ ఇది. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా (2022)లో నటించడంతో పాటు డైరెక్షన్ కూడా చేసి మెప్పించారు మాధవన్. ఈ సినిమాకు జాతీయ అవార్డు వచ్చింది. ఇప్పుడు మళ్లీ మరో బయోపిక్‌లో మాధవన్ నటిస్తుండటం విశేషం. మరి... వెండితెరపై మిరాకిల్ మేన్‌గా మాధవన్ ఏ స్థాయిలో ప్రేక్షకులను మెప్పిస్తారో చూడాలి.






## '14 రోజులు గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో' చిక్కుకుపోతే..

### ఓటీటీలోకి వచ్చేసిన మూవీ.!

తెలుగు యువ నటులు అంకిత్ కొయ్య, శ్రియా కొంతం జంటగా రూపొందిన రొమాంటిక్ లవ్‌స్టోరీ '14డేస్ గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో'. ఈ సినిమాకు శ్రీహర్ష దర్శకత్వం వహించగా.. సత్య నిర్మించాడు. మార్చి 07న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో నడిచింది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ ప్రస్తుతం ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హర్ష (అంకిత్ కొయ్య) ఎప్పుడు ఫిల్మ్ మేకర్ అవ్వాలని కలలు కంటూ ఉంటాడు. అయితే ఈ క్రమంలోనే హర్షకి ఒక డేటింగ్ యాప్‌లో ఆహాన (శ్రియ కొంతం) అనే అమ్మాయి పరిచయం అవుతుంది. ఇద్దరి స్నేహం కాస్తా ప్రేమగా మారుతుంది. ఆహాన తల్లిదండ్రులు ఒక రోజు పెళ్లికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేరని హర్షను తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తుంది. అలా తన గర్ల్‌ఫ్రెండ్‌ను కలవడానికి వెళ్లిన హర్షకు అదే ఇంట్లో 14 రోజులు ఉండాల్సి వస్తుంది. ఆహాన తల్లిదండ్రులకు, తాతకు తెలియకుండా హర్ష ఆ ఇంట్లో అన్ని రోజులు ఎలా గడిపాడు? హర్షను దాచడంలో ఆహాన ఎలాంటి కష్టాలు పడింది? పెళ్లికి వెళ్లిన ఆమె తల్లిదండ్రులు ఎందుకు అనుకోకుండా త్వరగా తిరిగి వచ్చారు? ఆహానకు ఎదురైన మరో సమస్య ఏమిటి? ఆ సమస్య నుంచి ఆహాన, హర్ష ఎలా తప్పించుకున్నారు అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే ఈ సినిమాను తప్పక చూడాలి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com